
శ్రీశ్రీశ్రీ శివబాలయోగి మహారాజ్ వారి

మార్చి 2013

# తపోలీల

ఆధ్యాత్మిక పత్రిక





శ్రీశ్రీశ్రీ శివబాలయోగి మహారాజ్ వారు తమ 12 సంవత్సరముల తపస్సు పూర్తి చేసిన చోట తమలో లీనమైన పార్వతీపరమేశ్వరుల విగ్రహములను స్థాపించుట - మహాశివరాత్రి 1962



శ్రీశ్రీశ్రీ శివబాలయోగి మహారాజ్ వారి

# తపోలీల

ఆధ్యాత్మిక పత్రిక

సంపుటం: 1 సంచిక: 1 మార్చి 2013

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే ॥

గురుర్బ్రహ్మా గురుర్ విష్ణుః గురుదేవో మహేశ్వరః ।
గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః ॥

## శివబాలయోగి - పరిచయము

అనాది కాలం నుండి అనేక మంది మహాత్ములు తమ భక్తి మరియు తపస్సు ద్వారా భగవంతునిలో లీనమవడం మనందరికీ తెలిసినదే. ఈ దృక్పథంలో చూస్తే శివబాలయోగి అద్వితీయులు. ఎందుచేతనంటే, స్వయంగా పార్వతీపరమేశ్వరులే అతనిలో లీనమైనందున. కేవలం 26 ఏళ్ల ప్రాయంలోనే సత్యరాజు అను ఈ బాలుడు వారి మార్గదర్శనములో తన 12 సంవత్సరాల తీవ్రమైన తపస్సు ద్వారా, సంపూర్ణ అహంకార రహిత స్థితిని సాధించినాడని మరియు ఈ కలియుగంలో తమ దైవిక ఉద్యమాన్ని నడిపించుటకు అతడి అర్హతను పరీక్షించి, రూఢీ చేసుకుని, అతడి నిస్వార్థతకు సంతృప్తులై సత్యరాజును "శివబాలయోగీశ్వరుడి"గా మార్చారు. అంటే, శివుడికి మరియు బాలా అనగా పార్వతికి అంకితమైన యోగీశ్వరుడు అని అర్థము. కాని, తమ సహజ ప్రకృతిననుసరించి స్వామివారు 'యోగీశ్వర' అన్న బిరుదు తమ గురువైన శివుడికి అన్వయిస్తుంది కాబట్టి అది స్వీకరించక 'యోగీశ్వర'కు బదులు మహాత్ములకు సాంప్రదాయికంగా వర్తించే 'మహారాజ్' అనే గౌరవాన్విత బిరుదుని స్వీకరించారు.

ఇది జరిగినది మన సమకాలీన ఈ ఆధునిక యుగంలోనే 1961వ సంవత్సరంలో, దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరీ నది పరివాహక ప్రాంతంలో. అతడి కఠోర తపస్సును ప్రత్యక్షంగా చూసి ధన్యులైన అనేక మంది ప్రజలేకాక, తపస్సులో ఉన్నప్పుడు తీసిన అతని ఫోటోలు మొదలైన సజీవ సాక్ష్యాలు మనకు లభించడం మన అదృష్టం.

1949వ సంవత్సరం ఆగస్టు 7న సత్యరాజు అనే 14 సంవత్సరాల ఒక గ్రామీణ బాలుడికి ఒక దివ్య క్షణాన శంకర భగవానుడు జంగమదేవర రూపంలో ప్రత్యక్షమై, బాలుడి భృకుటి (కనుబొమల మధ్య) మీద తన మధ్య వ్రేలితో స్పృశించి, తలమీద మెల్లగా తట్టగా, వెంటనే బాలుడు బాహ్యచైతన్యం కోల్పోయి, నిశ్చలమైన తీవ్ర నిర్వికల్ప సమాధి స్థితిని పొందాడు. ఈ విధంగా అతనికి జ్ఞానోదయం కలిగింది.

ఆ క్షణం నుండి అతను 8 సంవత్సరములు రోజుకు 23 గంటల చొప్పున, మరో 4 సంవత్సరములు రోజుకు కనీసం 12 గంటల చొప్పున కఠోరమైన ఘోర తపస్సు చేశాడు. ఒక్కొక్కసారి కొన్ని నెలలపాటు వారములు జాగ్రతావస్థలోకి రాక నిర్వికల్ప సమాధిలోనే వున్న సందర్భాలు కూడా కలవు.

1961లో తపస్సు సమాప్తికి ముందు నుంచే స్వామీజీవారు తమ గురువు ఆదేశానుసారం, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమములైన మార్గదర్శనము, విభూతి ద్వారా శారీరక మరియు మానసిక స్వస్థత చేకూర్చుట మరియు అన్నదానము

మిగతా 3వ పేజీలో...

**ప్రియ భక్తులారా!**

శ్రీశివబాలయోగి మహారాజ్ అంతర్రాష్ట్రీయ ట్రస్టు 'తపోలీల' పత్రికను వివిధ భాషలలో ముద్రణ మరియు ఈ-మెయిల్, వెబ్‌సైట్ ద్వారా ప్రచురించి, అధ్యాత్మిక జ్ఞానాన్ని పంచిపెట్టేందుకు కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ దైవకార్యం నిరంతరాయంగా సాగేందుకు విరాళములను అందించి ప్రోత్సహించాల్సినదిగా కోరుచున్నాము.

పత్రిక ప్రచురణకుగాని, లేదా ట్రస్టు నిర్వహించే ఇతర సేవా కార్యక్రమములకు గాని విరాళములను అందించగోరేవారు చెక్కు లేదా మనియార్డరు ద్వారా ట్రస్టు అడ్రస్సుకి పంపించగలరు. దాతలకు తగిన రసీదులను పంపించబడుతుంది.

విరాళములను **National Electronic Fund Transfer (NEFT)** ద్వారా కూడా ట్రస్టు యొక్క బ్యాంకు ఖాతాకి జమ చేయవచ్చును. ట్రస్టు ఈ-మెయిల్‌కి మీ వివరాలను జతపరిచితే రసీదులను ఆయా దాతలకి పంపించబడుతుంది.

దయగల భక్తులు రాబోయే సంచికలో ప్రకటనలు ఇచ్చి ప్రోత్సహించాల్సిందిగా కోరుచున్నాము. ప్రకటనలకు మీరు ఇచ్చిన నగదుని పత్రిక ప్రచురణ ఖర్చులకు వినియోగించబడుతుంది.

– సంపాదకులు

## లోపలి పేజీల్లో ....


సంపాదకీయం – తపోలీల ... 4

టామ్‌గారి సందేశం ... 6

బాబాజీ సందేశం ... 8

శ్రీశ్రీశ్రీ శివబాలయోగీంద్రుల జీవిత చరిత్ర ... 10

ధ్యానదీక్ష ... 16

మనం భజన చేసే ప్రతి పర్యాయం దేవుళ్ళు అక్కడ ఉంటారు ... 17

భావము లేక భావసమాధి ... 20

సేవకు ప్రతిరూపం శ్రీస్వామివారి మాతృదేవత – శ్రీమతి అల్లక పార్వతమ్మగారు ... 22

అన్నపూర్ణమ్మ గారి అనుభవాలు ... 25

కౌపీనధారి ... 30



**ప్రచురణకర్త**

**శ్రీ శివబాలయోగి మహారాజ్ అంతర్రాష్ట్రీయ ట్రస్టు**

నెం.2, హోసూర్‌రోడ్, లాంగ్‌ఫోర్డ్ టౌన్, బెంగుళూరు – 560 025

ఫోన్: 080-22225142, మొబైల్: 9845476525

E-mail: djksby@hotmail.com Website: www.shiva.org

**సంపాదక బృందం**

దాసరి జగదీశ్ కుమార్, యశోద, K.N. బాలకృష్ణ, K.L.V.V. సత్యనారాయణ మరియు పద్మశ్రీ

**డిజైనింగ్ & ప్రింటింగ్**

భండారీ ఆర్ట్స్ 'ఎస్' ప్రింటర్స్

గాంధీనగర్, హైదరాబాద్ – 500 080.

సెల్: 99634 80837


**చందా వివరాలు**

| | |
|---|---|
| విడి ప్రతి | రూ.40/- |
| ఒక సంవత్సరానికి | రూ.150/- |
| మూడు సంవత్సరాలకు | రూ.400/- |
| ఐదు సంవత్సరాలకు | రూ.650/- |

**ప్రకటన వివరాలు**

| | |
|---|---|
| బ్లాక్ & వైట్ 1/2 పేజ్ | రూ. 500/- |
| బ్లాక్ & వైట్ ఫుల్ పేజ్ | రూ.1,000/- |
| ఇన్నర్ కలర్ 1/2 పేజ్ | రూ.1,000/- |
| ఇన్నర్ కలర్ ఫుల్ పేజ్ | రూ.2,000/- |
| ఇన్నర్ కలర్ 1/2 పేజ్ | రూ.2,000/- |
| ఇన్నర్ కలర్ ఫుల్ పేజ్ | రూ.3,000/- |

1వ పేజీ తరువాయి...



స్వామివారు ఇటలీలో 'ఇటలీశ్వరుడి'ని ప్రతిష్ఠించుట

చేయుట మొదలు పెట్టారు. ఇందుకు గాను ఆయన ఎన్నడూ ఎవరి నుండి ఎటువంటి శుల్కమూ తీసుకోలేదు మరియు ఏ విధమైన భౌతిక సంపదనూ ఆర్జించలేదు.

1963 నుండి 1994 వరకు మూడు దశాబ్దాలకు పైగా శివబాలయోగివారు తమ దైవిక ఉద్యమ కార్యనిమిత్తం భారతదేశం మరియు శ్రీలంకాలలో విస్తృతంగా పర్యటించారు. 1987 నుండి 1991 వరకు ఇంగ్లెండు, ఇటలీ మరియు అమెరికాలలో పర్యటించారు. ఆయన సార్వజనిక కార్యక్రమములు జరిపిన ప్రతిచోటా లక్షలమంది ధ్యానదీక్షను పొందారు. వారంతటవారే స్వయంగా సత్యమును తెలుసుకొనుటకు ధ్యానం చేయమని ప్రోత్సహించడమే ఆయన చేసిన ఏకైక బోధన.

తమ దైవిక ఉద్యమాన్ని నడిపించుటకు అనేక ఆశ్రమాలనూ, కేంద్రాలనూ మరియు నాలుగు చారిటబుల్ ట్రస్టులను – ఇండియాలో ఒకటి, ఇంగ్లెండులో ఒకటి, మరియు అమెరికాలో రెండు ట్రస్టులు – స్థాపించారు. అనేక దేవీ-దేవతల విగ్రహాలను ఈ కేంద్రాలలో మరియు అనేక దేవస్థానాలలో ప్రాణప్రతిష్ఠ చేసారు.

స్వామీజీవారి ప్రాథమిక బోధన ధ్యానమే అయినప్పటికీ, ఇతర ఆధ్యాత్మిక సాధనలైన భజనలు, పూజలు, హోమములు, ఇత్యాదిని కూడా ఆయన ప్రోత్సహించారు. ఆత్మజ్ఞానములో మరియు సనాతన ధర్మములో విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పి, ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని కార్యశీలమైన పద్ధతిలో నేర్పిస్తారు. మన ప్రాచీన ఋషుల సంప్రదాయమే సనాతన ధర్మమనీ, అదే ప్రపంచంలోని అన్ని సంస్కృతులకు మూల పునాది అనీ స్వామీజీవారు తరచూ వ్యాఖ్యానించేవారు. ఈ ఆధునిక యుగంలో సనాతన ధర్మం గురించి స్పష్టమైన అవగాహన లేదు. కానీ ఈ కాలములోనే పురాతన సాంప్రదాయాలు తిరిగి కనుగొనబడి బహిరంగంగా వెల్లడి అవుతున్నవి. అన్ని సంస్కృతులకు మూలమైన ఆధ్యాత్మిక సంబంధాలను మరియు సత్యమును తెలుసుకొనుటకు స్వామీజీవారి జీవితము మరియు వారి ఆశీర్వాదములు మనకు ఒక అనంత శక్తి స్థావరము.

కాలచక్రాలు ఉంటాయనీ, ప్రత్యేకించి అందులో మనమిప్పుడు అజ్ఞానంతో కూడుకున్న వినాశకాల సమయంలో ఉంటున్నామని స్వామీజీ చెప్పారు. మన ప్రాచీన ఆధ్యాత్మిక సాంప్రదాయాలు జనన జీవన మరణ చక్రాల అవగాహన కలిగియున్నవి. పునస్సృష్టికి ముందు సంభవించే కష్టకాలంలో మనమిప్పుడు ఉన్నామని ఈ సంప్రదాయాలు సూచిస్తున్నాయి. ఈ ఆధునిక ప్రపంచం అతిరేకముతో కూడుకున్నది. అత్యాధునిక సాంకేతిక పురోభివృద్ధి మరియు సంపద, హింసాత్మక అల్లర్లు, అణ్వాయుధాలు మరియు వాతావరణ కాలుష్యాలు సామూహిక వినాశానికి దారి తీస్తున్నవి. స్వామీజీ మరియు గత శతాబ్దికి చెందిన ఇతర మహాత్ములు తీవ్రమవుతున్న ప్రస్తుత క్లిష్ట పరిస్థితులు ముస్ముందు ఆవిర్భవించే సద్భావనలతో కూడుకున్న కొత్త యుగాన్ని సూచిస్తున్నాయని ధృవీకరించారు.

శివబాలయోగి జన్మించి, తపస్సు గావించి, ఆశీస్సులను వెదజల్లుతున్నది ఇటువంటి ఈ సందర్భంలో. వ్యక్తిగతమైన ఏ కోరికా లేకుండా, చివరికి భగవంతుడిని దర్శించాలన్న ఆకాంక్ష కూడా లేకుండా ఆయన కఠోరమైన తపస్సు చేశారు. పరమాణు బాంబులు, పర్యావరణ నాశనం గురించి ఆయన తరచూ హెచ్చరించేవారు. మానవ జాతి తనను తానే వినాశనం చేసుకోకుండా పరిస్థితులను నివారించడం కూడా తన తపస్సు యొక్క ఉద్దేశాలలో ఒకటని వివరించారు. ప్రపంచమంతా ఎంతో ఆందోళనతో కూడి ఉంది. దానిని తగ్గించుటయే తన 'మిషన్' యొక్క లక్ష్యం అని చెప్పారు.

మిగతా 15వ పేజీలో...

# తపోలీల సంపాదకీయం...

తపస్సు అన్నది అతి తీవ్రమైన మరియు కఠోరమైన అధ్యాత్మిక సాధన అన్నది మనందరికి తెలుసు. ఇందుకు భిన్నమైన పదం 'లీల'. మరి 'తపోలీల' అంటే ఏమిటి? అని పాఠకులకు సందేహం కలుగవచ్చు.

పరమ భాగవతులు మరియు జ్ఞానోదయం పొందినవారు కూడా ఈ జగత్తు మరియు ఇందులో జరుగుతున్న క్రియలన్నీ భగవంతుడి లీలా విశేషాలే అని పేర్కొంటూ వుంటారు. కృష్ణుడు శిశువుగా ఉన్నప్పుడే ఎందరో రాక్షసులను సంహరించాడు. ఇది అత్యంత మహత్తరమైన, గంభీరమైన లోకకళ్యాణ కార్యముగా పరిగణించబడుతుంది. అదే కృష్ణుడు తన బాల్యంలో సాకు తల్లి యశోదతోనూ, అతడి మేనత్త రాధతోనూ, గోపికలతోనూ మరియు బృందావనంలోని గోపాలురతోనూ సరదాగా, నయన మనోహరమైన చిలిపి చేష్టలతో ఆడిన ఆట "రాసలీల" అని "కృష్ణలీల" అని పేర్కొన బడుతున్నది. గోపికలు మైమరచి ఆ దివ్యబాలుడి ప్రేమలో సంపూర్ణంగా లీనమైపోయేవారు. మరియు అతని మైమరపించే వేణుగానానికి తన్మయత్వంతో నృత్యం చేస్తూ భగవదానందకరమైన రోజులను గడిపారు. కృష్ణుడు తన అసాధారణమైన దైవిక శక్తితో లోకకంటకులైన రాక్షసులను సంహరించినవాడైనప్పటికీ రేపల్లెలోని గోపికలుగాని, గోపాలురుగాని లేదా బృందావనంలోని భక్తజనంగాని కొనియాడినదీ, ఆరాధించినదీ, హృదయంలో భద్రపరచుకొని పూజించినదీ ఆ బాలకృష్ణుడి దివ్యలీలలనే. ఒక ప్రక్క దుర్మార్గులను శిక్షిస్తూ మరొకప్రక్క తన ప్రేమ ప్రవాహంలో కృష్ణుడు బృందావనాన్ని ఆసాంతం ముంచివేశాడు.

స్వామీజీ 12 సంవత్సరాల కఠోరమైన తపస్సు చేశారు. ఎన్నో విషమ పరీక్షలను ఎదుర్కొన్నారు మరియు విశ్వశాంతి కోసం ఎన్నో లోకోత్తరమైన కార్యాలను నిర్వర్తించారు. కాని దాదాపు స్వామీజీ భక్తులందరూ ఎప్పటికీ మరువనిది అయన సన్నిధిలో వారు పరమానందంగా గడిపిన ఆ కొద్ది సమయము ఆ కొన్ని క్షణాలనే పదే పదే స్మరించుకొంటూ అయన వారిపై చూపిన ప్రేమకి, వాత్సల్యానికి ఉద్వేగంతో ఉప్పొంగి, అప్పటికీ ఆనందబాష్పాలు రాల్చటం ఆశ్చర్యకరం. అయితే



ఆ ఆనందానికి కారణం గ్రహించటం కష్టసాధ్యం కాదు. అమెరికాలో ఒక కార్యక్రమములో 'దర్శన' సమయంలో అక్కడి స్థానిక భక్తులు 'యోగి' అన్న పదానికి సరైన నిర్వచనం ఏమిటి అని తర్జన పడుతున్నప్పుడు, స్వామీజీవారు వెంటనే "Yogi is Love" ("యోగి అంటే ప్రేమ") అని చెప్పారు. స్వామీజీ వారే స్వయంగా ఇంగ్లీషులో అక్కడి స్థానిక యాసలోనే 'V' అక్షరాన్ని దీర్ఘంగా ఉచ్చరిస్తూ, ప్రేమ అనే పదం యొక్క భావం హృదయానికి హత్తుకునేలాగ నొక్కి చెప్పారు.

కొన్ని సంవత్సరాలపాటు అయనతో వసించి, సేవ చేసుకుని, నెరపిన సాంగత్యంవల్ల అయన కించిత్తూ స్వార్థం లేకుండా, దేశ, కాల, వర్ణ, వర్గాల వంటి భేదాలు, తారతమ్య భావన లేకుండా పంచిన ప్రేమ, అయన భక్తి మరియు దివ్యమైన తపశ్శక్తి, వీటి ద్వారా పరలోక దేవతలనే గాక మన అంతరంగంలోనే ఉన్న దైవాన్ని సైతం మేల్కొలిపి, మనతో ఆడుకునేలా చేయగలరని అర్థం చేసుకున్నాము. యోగులు ప్రేరేపించే శక్తి ఎంత అద్భుతంగా ఉంటుందంటే

స్వామీజీ 12 సంవత్సరాల కఠోరమైన తపస్సు చేశారు. ఎన్నో విషమ పరీక్షలను ఎదుర్కొన్నారు మరియు విశ్వశాంతి కోసం ఎన్నో లోకోత్తరమైన కార్యాలను నిర్వర్తించారు. కాని దాదాపు స్వామీజీ భక్తులందరూ ఎప్పటికీ మరువనిది ఆయన సన్నిధిలో వారు పరమానందంగా గడిపిన ఆ కొద్ది సమయము ఆ కొన్ని క్షణాలనే పదే పదే స్మరించుకొంటూ ఆయన వారిపై చూపిన ప్రేమకి, వాత్సల్యానికి ఉద్వేగంతో ఉప్పొంగి, ఇప్పటికీ ఆనందబాష్పాలు రాల్చటం ఆశ్చర్యకరం. అయితే ఆ ఆనందానికి కారణం గ్రహించటం కష్టసాధ్యం కాదు.

తరతరాలవరకూ వారి భక్తులు దానిని గూర్చి తలచుకుంటూనే వుంటారు. ఇదే 'తపోలీల'. ఇలాంటి తపోలీలలని అనుభవించినవారు, అనుభవిస్తున్నవారు భక్తులందరితో వాటిని పంచుకుని, ఆనందించుటకు ఈ పత్రికను ఒక వాహనంగా వాడుకోవాలన్నదే మా ఆకాంక్ష.

స్వామీజీవారు నిర్వర్తించిన లోకోత్తర కార్యములు ఎట్టివి అని ఎప్పుడు అడిగినా అందుకు స్వామీజీవారు ఇలా చెప్పేవారు. "స్వామీజీ తను చేసిన కార్యముల గురించి చెప్పుకోరు. మీరు స్వామీజీ భక్తులను అడిగి వారు స్వామీజీ నుండి ఎటువంటి సేవను పొందారో తెలుసుకోండి". లెక్కకు మిక్కిలి భక్తులు స్వామీజీవారి ఆశీస్సులవల్ల దివ్యానుభవాలను పొందారు ఇప్పటికీ పొందుతున్నారు. స్వామీజీవారి జీవితం మరియు వారి లోకోత్తర కార్యముల గురించి అనేక పుస్తకములు భారతీయ భాషలలో, ఇంగ్లీష్, చైనీస్ మరియు ఇటాలియన్ భాషలలో ప్రచురించబడ్డాయి. అపారమైన సమాచారాన్ని కూడా భక్తులు ఇంటర్‌నెట్‌లో పొందుపరచడం జరుగుతున్నది. ఇటువంటి పుస్తకాలనుండి, ఇతర వనరులనుండి మరియు భక్తుల అనుభవాలనుండి విషయాలను సేకరించి ఆధ్యాత్మిక కథలు మరియు దివ్యానుభవాలనే అమూల్యమైన రత్న సంపదను ఈ 'తపోలీల' పత్రిక ద్వారా పాఠకులకు అందివ్వడానికి మేము కృషి చేస్తున్నాము. అంతకంటే ముఖ్యంగా సామాన్య ప్రజలలో యోగులను గురించి ఉన్న అభిప్రాయానికి వారు వాస్తవంలో ఎంత భిన్నంగా ఉంటారని మేము గుర్తించిన విషయమును ఎత్తిచూపించదలచుకున్నాము. కట్టుకథలను, మూఢనమ్మకాలను, దురాచారాలను శివబాలయోగి బయలుపరచి సత్యాన్ని మనకు బోధించారు. ఈ దైవకార్యము నిర్విఘ్నంగా సాగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తూ, స్వామీజీవారి ఆశీస్సులను కోరుతూ, భక్తులందరి సహకారమును వేడుచున్నాము. *


***With best compliments from:***

**OFFICERS' WEAR DEPOT ®**
**OFFICERS' TAILORING HOUSE ®**


**No.77, M.G. ROAD,**
**BANGALORE - 560 001**
**Ph: 080-4112 1575, 2555 0902**

**THE RAYMOND SHOP**

**No.120, 8th ROAD,**
**Opp. SATYA SAI HOSPITAL,**
**EPIP AREA, WHITEFIELD,**
**BANGALORE - 560 066**
**Ph: 080-41462222**



# టామ్ గారి సందేశం



తపశ్శక్తి - "స్వామీజీ బైబిల్" థామస్ ఎల్. పలోటాస్ వారిచే సంకలనము చేసి సంగ్రహించబడినది

'తపోలీల' పత్రిక మొదటి సంచికకు నా హృదయపూర్వక అభినందనలు.

'తపోలీల' అనే పేరు యోగులలో మహాయోగులైన, మనకు అత్యంత ప్రేమాస్పదులైన శ్రీశ్రీశ్రీ శివబాలయోగి మహారాజ్ వారి రెండు భిన్నమైన అంశాలను తెలియపరుస్తుంది. 'తప' శబ్దము, శివబాలయోగి 12 సంవత్సరముల కఠోర తపస్సు చేసి సాధించిన తపశ్శక్తిని సూచిస్తుంది. యోగుల శక్తులనేవి సామాన్య భావనలకు మరియు కల్పనలకు అతీతంగా ఉంటాయి. "యోగులు దేవుళ్ళకంటే చాలా శక్తివంతులు" అని స్వామీజీ తరచూ చెప్పేవారు. ఇక 'లీల' అంటే ఆట, చిన్న పిల్లల ఆట. అది చిన్న పిల్లల్లాగ నిరాడంబరంగా, లేశమైనా పక్షపాతం లేకుండా, ప్రపంచాన్నే శాసించే దివ్య శక్తి తనలో ఉన్నా అది వ్యక్త పరచక, తనకోసం గాని, తన స్వార్థం కోసం గాని దానిని వాడక, అణుమంతైనా స్వార్థం లేకుండా కేవలం మానవాళి శ్రేయస్సే పరమ ధ్యేయంగా స్వామీజీ చేసిన సేవను సూచిస్తుంది. అందుకే ఇది 'లీల' అనబడుతుంది. శివబాలయోగివారు మనకు వైరుధ్యాలుగా కనిపించే విషయాలను సైతం తమయందే ఇముడ్చుకొని వాటిని ఒక్కతాటిపైకి తీసుకువచ్చి చూపించారు. స్వయంగా తమ పేరే శివ(పురుష) బాల(స్త్రీ) అనే సహజ వైరుధ్యాలను ప్రతిబింబిస్తుంది. పత్రిక శిరోనామమైన 'తపోలీల'లో తమ పేరులాగ మరియు తనకు చిన్న పిల్లల ఆటలతో సమానమైన ఆయన దివ్య శక్తులు శివబాలయోగి సామాన్య భావనలకు మరియు ఊహాలకు అతీతము అనే విషయాన్ని ధృవీకరిస్తుంది.

స్వామీజీ తరచూ చెప్పినట్లుగా ఆయన ఒక కార్యశీలమైన యోగి. (Practical Yogi). ఆయన పుస్తక జ్ఞానానికంటే అనుభవానికి, సిద్ధాంతాలకంటే ఆచరణకి, మరియు మతంకంటే ఆధ్యాత్మికతకు ప్రాధాన్యత ఇవ్వాలని నొక్కి చెప్పారు. ఎన్నో ఆధ్యాత్మిక పుస్తకాలు, మరియు ఎంతో మంది ఆధ్యాత్మిక వేత్తలు సమ్మోహనకరమైన భగవంతుడి గురించి, మహాత్ములు బోధించిన ఆధ్యాత్మిక నమ్మకాలు మరియు సాధనల గురించి అందమైన మాటలతో తమ అనుభవాలను వ్రాసి పంచుకున్నారు. కాని శివబాలయోగివారు మహోత్తరమైన దివ్యప్రకాశమైన తమ సన్నిధి ద్వారా, మౌనంలోనే బోధించారు. భక్తులు ఎప్పుడైనా ఆధ్యాత్మిక విషయాల గురించి ప్రశ్నలు అడిగినప్పుడు స్వామీజీ, ఏ రోజూ ఆత్మసాక్షాత్కారం గురించిగాని, ముక్తి గురించిగాని మాట్లాడలేదు. ఉపన్యాసాలు ఇవ్వలేదు. సిద్ధాంతాలను వల్లించలేదు. "యోగి ఎప్పుడూ మౌనంగానే ఉండాలి. మౌనంగా ఉండటం చేతనే సమస్తాన్నీ నియంత్రించగలడు. అయినా ఈ కొద్దిపాటి మాటలు మాట్లాడుతూ ఉన్నానంటే అది మీరు ప్రశ్నలు అడుగుటంవల్లనే. లేకపోతే స్వామీజీ వీటన్నిటి గురించి మాట్లాడరు" అనేవారు.

శివబాలయోగివారి ప్రధాన బోధనలు ఏమి? అయన ప్రతియొక్కరినీ తమ తమ మనస్సుని నియంత్రించుకోవాలని, ఆందోళనలను తగ్గించుకుని ఒకరికొకరు సహాయపడుతూ వారి అంతరంగంలో ఉదయించే ప్రశ్నలకు వారే సమాధానాన్ని కనుగొనాలని ప్రోత్సహించారు.

అయన సైద్ధాంతిక రూపంలో కాకుండా, సరళమైన, కార్యానుకూలమైన సలహాలను ఇచ్చేవారు. మనం మనస్సుని గనుక నియంత్రించగలిగితే ఒక మహత్తరమైన స్ఫూర్తి కలిగి, మన దైనందిన ఉద్యోగాలను నెరవేర్చుటలో గాని, లేదా సంబంధాలను మెరుగుపరచుకునే విషయంలోగాని అది అతి ఫలవంతముగా పనిచేయుటకు తోడ్పడుతుంది. భక్తులు ఎప్పుడు స్వామీజీ దర్శనార్థం వెళ్ళినా స్వామీజీ సరళంగా ఇలా అడిగేవారు. "నీకు ఏమి కావాలి?" ఇవే శివబాలయోగి ఆశీస్సులంటే.

శివబాలయోగివారు ప్రజలను తమకు ఏవిధమైన ఆధ్యాత్మిక సాధనల గురించి ఆసక్తి ఉంటే వాటినే కొనసాగించమని ప్రోత్సహించారు. కాని తన కార్యక్రమములో మాత్రం ధ్యానం మరియు భజనలు తప్పక ఉండేవి. దాదాపు యోగులందరూ కూడా ప్రజలకు ధ్యానాన్ని నేర్పించి, భక్తిగీతాలు మరియు భజనల ద్వారా ఆనంద పారవశ్యమూ, భావావేశమూ అయిన భావసమాధిని కలిగించేవారు. ఒక యోగిగా అదే పద్ధతిని శ్రీ శివబాలయోగివారు కొనసాగిస్తున్నా, గతంలో ఏ ఇతర యోగీ చేయనటువంటి, నమ్మశక్యం కాని రీతిలో ఇంత విరివిగా, భావసమాధిని మొదలుకొని, ధ్యానంలో అయన భక్తులకు ఇచ్చే అపూర్వ అనుభవాలుగాని, తన దర్శన మాత్రం చేత భక్తులలో తీసుకువస్తున్న పెను మార్పులుగాని, ఇవన్నీ అయన సాటిలేని అనుపమమూ, అద్వితీయమూ అయినటువంటి ప్రత్యేకతను చాటి చెబుతున్నాయి. ఇదే అయన తపోలీల.

శివబాలయోగి ఎందుకు తపస్సుకు కూర్చొన్నారని లేదా ఎందుకు ఇంతగా పర్యటిస్తున్నారని భక్తులు ఎవరైనా అడిగినప్పుడు అయన తరచూ ఇచ్చిన సమాధానం అది అయన కర్తవ్యమని. ప్రపంచంలో ప్రతియొక్కరికీ తమదే అయిన ఒక కర్తవ్యం ఉంటుంది. ఆ కర్తవ్యాన్ని నిర్వహించడం కోసమే ఈ ప్రపంచంలో పుడతారు.. అందులో అతి తక్కువ మంది మాత్రమే తపస్సు చేయడంకోసం జన్మిస్తారు. ఇలా సేవకు సజీవ ఉదాహరణగా మన మధ్య నిలచిన ఒక శక్తిమంతమైన యోగి జీవితం ఎలా ఉంటుంది? మన మనస్సు మరియు హృదయాలను తెరచి ఉంచి, నిర్భయంగా, రాజీలేని నిజాయితీతో సేవచేస్తూ, అందరినీ గౌరవిస్తూ ఈ ప్రపంచంలోని అనుభవాలను ఆనందించవచ్చు.

శివబాలయోగివారు మహాసమాధి చెంది పద్దెనిమిది సంవత్సరాలు గడచినవి. మన మధ్య అయన తన భౌతిక శరీరంతో జీవించేటప్పుడు కేవలం తమ దివ్య సన్నిధి ద్వారానే ప్రజలలో పరివర్తన కలిగించేవారు. శరీరము లేనప్పుడే తాను భక్తులకు ఎక్కువగా అందుబాటులో ఉంటానని చెప్పి, తమ దివ్యసన్నిధి ధ్యాన దీక్ష ద్వారా దొరుకుతుందని, ప్రతి మనిషీ తన సొంత అనుభవం ద్వారా భగవంతుని తెలుసుకోవాలని చెప్పారు. తమ భౌతిక శరీరం త్యజించి శివబాలయోగివారు మనలను మన అంతరంగ అన్వేషణకు ప్రేరేపించారు.


శివబాలయోగివారు భక్తులకు తమ గురించి మరియు తమ భక్తుల అనుభవాల గురించి వ్రాయుటకు స్ఫూర్తినిచ్చి ప్రోత్సహించేవారు, ఇప్పటికీ ప్రోత్సహిస్తున్నారు. అందుకు ఈ తపోలీల పత్రికే ఒక నిదర్శనం. స్వామీజీ ఎప్పుడూ తమ భక్తులతో తమకున్న ఆత్మసంబంధం గురించి మాట్లాడేవారు. ఈ సంబంధం చాలా విధాలుగా జాగృతమై బలోపేతమవుతుంది. ఇది కేవలం ధ్యానదీక్ష, భజన లేదా భావం ద్వారా మాత్రమే కాకుండా స్వామీజీవారి ఒక చిన్న ఫోటో ద్వారా కూడా జరగవచ్చును. శివబాలయోగివారి గురించి గాని, అయన భక్తుల మీద అయన చూపిన ప్రభావం గురించి గాని, చదవడం చాలా మహత్తరమైన స్ఫూర్తిదాయకాలు కావచ్చును. అది అయన్ని దర్శించినంత ఫలము.

తపోలీల పత్రిక శివబాలయోగి వారి గురించి ఎక్కువగా తెలుసుకొనుటకు మరియు ఆత్మ సంబంధాన్ని పెంపొందించుటకు ప్రజలకు చాలా సహాయ కారణమవుతుంది. శివబాలయోగివారి మాతృభాష అయిన తెలుగులో ఈ 'తపోలీల'ను ప్రచురించటం అద్భుతమైన, విశ్వవ్యాప్తమైన ఈ మహత్తర కార్యాన్ని ఒక అమృతం పూర్తి గావించి, తిరిగి అయన పుట్టిన ఆంధ్రదేశంలోని తెలుగువారి, తెలుగు సాంప్రదాయానికి తీసుకువస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని 'అడివారపుపేట' అనే ఒక చిన్న గ్రామాన్ని అయన జన్మించి, తపస్సు చేయుటకు ఎన్నుకున్నారు. ఇప్పటికీ ఆ అడివారపు పేట నుంచే అయన సన్నిధి ఈ ప్రపంచానికే కాక, అన్ని లోకాలకూ ప్రసరిస్తుంది.

స్వామీజీవారి వాణి ఇప్పటికీ తెలుగుగానే మిగిలిపోయింది.

ధన్యవాదాలు.

# బాబాజీ సందేశం



భక్తుల సౌకర్యార్థము తెలుగులో మరియు ఇంగ్లీషులో స్వామీజీ పత్రికను ప్రచురిస్తున్నందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను. స్వామీజీ కృపవల్ల ప్రేరితులై ఈ మహాకార్యంలో పాలుపంచుకునే భక్తులందరి ప్రయత్నములకు మిక్కిలి ప్రశంసలను అందజేస్తున్నాను. అవును, నిజంగా స్వామివారే భక్తులను ఉత్తేజపరచి, మార్గదర్శనమిచ్చి ప్రపంచశాంతికొరకు పనిచేసేలా ప్రోత్సహిస్తారు.

లోక కల్యాణం కోసం అవతరించిన ఎంతో మంది మహాయోగులలో స్వామీజీ కూడా ఒకరు. స్వామీజీ తరచూ లోకకల్యాణం గురించి మాట్లాడేవారు. మనందరికీ స్వామీజీ తల్లిలాంటివారు. ఆయన అందరికీ తన అంతులేని వాత్సల్యము మరియు ఆప్యాయతను చూపిస్తూ, ప్రతి ఒక్కరూ ఆయనతో తమకు విశిష్టమైన ఒక ప్రత్యేక సంబంధాన్ని ఏర్పరచుకుని అనుభవించేలా చేసేవారు. మనమందరమూ సముద్రమువంటి స్వామీజీలో చిన్న చినుకులాంటివాళ్లం.

ఆయన కేవలం లోకకల్యాణం కోసమే తపస్సు చేసారు. ఆయన ఎప్పుడూ మనతోనే ఉన్నారు. ఆయన భౌతిక శరీరంలో ఉన్నప్పుడు, కలిసి తిరిగేటప్పుడు దేవుడే వచ్చి మనతో కలిసి తిరుగుతున్నట్టు అనిపించేది. మనమంతా చాలా అదృష్టవంతులము. ఈ రోజు స్వామీజీ భక్తులుగా ఉన్నామంటే అది మన ఎన్నో జన్మల పుణ్య కర్మల ఫలితమే.

తపస్సు చేసిన ఎంతో మంది గొప్ప యోగులలో ఒకరైన స్వామీజీ, దక్షిణామూర్తిలా మౌనంలో బోధించారు. మరియు మనస్సుని నియంత్రించడానికి ధ్యానాన్ని నేర్పించారు. "ధ్యానం చేసి నిన్ను నీవు తెలుసుకో"మని నొక్కి చెప్పేవారు.

ఆయన తరచూ, "చూడు, ఈ ప్రపంచంలో ఏది చేసినా అది నీ కోసం, నీ సంతోషం కోసమే చేస్తావు. ఎవరికన్నా సాయం చేయాలన్నా అది నీకు సంతోషం కలిగిస్తుందనే చేస్తావు. కనుక ఎవరైనా ఏదైనా తమ కోసమే తాము చేస్తారు. కాబట్టి ముందుగా నిన్ను నువ్వు తెలుసుకో అప్పుడు నీకు ఏమి అవసరమో, ఏమి చేయవలసి ఉంటుందో నీవు తెలుసుకోగలవు" అనేవారు.

స్వామీజీ భక్తి మార్గాన్ని బోధించి, భక్తి గీతాలను పాడటానికి ప్రోత్సాహించారు. భజనలను పాడటం నేర్పించారు. ఆయన తన అమోఘమైన తపశ్శక్తి ద్వారా భక్తులను భావసమాధిలోకి వెళ్ళేలా దీవించారు, దీవిస్తున్నారు. ఈ సమీపకాలంలో వేరే ఏ ఇతర యోగి కూడ ఇంతగా భావసమాధిని ప్రసాదించిన దాఖలాలు లేవు. ఆయన భేద భావం చూపక, అందరినీ ఆశీర్వదించి భావసమాధిని ప్రసాదించేవారు. ఫలితమును ఆశించని, సేవా మార్గమైన కర్మయోగాన్ని నేర్పించేవారు. "ఫలాపేక్ష లేకుండా సేవ చెయ్యాలి" అని బోధించేవారు.

"గురువు నీకు కావలసినవన్నీ తనే సమకూరుస్తాడు. మొదట భక్తుల బాధలన్నింటినీ తొలగించాలి. అప్పుడే వారు నిశ్చింతగా సాధన చేయగలుగుతారు"అనేవారు. అందుకని ఎవరైతే బాధలతో స్వామి దగ్గరికి వస్తారో వారందరికీ ఆశీర్వదించిన పవిత్రమైన విభూతిని ఇచ్చేవారు. అలా తన తపశ్శక్తినంతా లోకశ్రేయస్సు కోసం వినియోగించేవారు.

**ఆయన కేవలం లోకకల్యాణం కోసమే తపస్సు చేసారు. ఆయన ఎప్పుడూ మనతోనే ఉన్నారు. ఆయన భౌతిక శరీరంలో ఉన్నప్పుడు, కలిసి తిరిగేటప్పుడు దేవుడే వచ్చి మనతో కలిసి తిరుగుతున్నట్టు అనిపించేది. మనమంతా చాలా అదృష్టవంతులము. ఈ రోజు స్వామీజీ భక్తులుగా ఉన్నామంటే అది మన ఎన్నో జన్మల పుణ్య కర్మల ఫలితమే.**



బెంగుళూరు ఆశ్రమ ఆవరణలో అన్నదానం జరుగుతున్న దృశ్యం

వృథాగా మాట్లాడేమాటలు పనికిరావు దానికి విలువలేదు. ప్రతియొక్కరూ సాధన చేయాలి అనేవారు.

స్వామీజీ అన్నదానమును ప్రోత్సహించేవారు. అన్నదానమంటే స్వామీజీకి ఎంతో ఇష్టం. కుల, మత, జాతి, ధన భేదాలు లేకుండా, పక్షపాతం లేకుండా మానవజాతినంతటినీ ఒక్కటిగా ఉండాలని కోరుకునేవారు. ఒకసారి అన్నదానం యొక్క మహాత్మ్యం గురించి వివరిస్తూ ఇలా అన్నారు. "చూడండీ ఒక వ్యక్తి అన్నదానం గురించి కొంత డబ్బును దానం చేశాడంటే అది అతను ఎంతో భక్తితో, స్వచ్ఛమైన భావంతో చేస్తాడు. చాలా మంది సేవా రూపంలో అన్నదానం కార్యక్రమం విజయవంతానికి కృషి చేస్తారు. వారు కూడా అది భక్తితో, స్వచ్ఛమైన మనస్సుతో చేస్తారు. నీవు డబ్బు సంపాదన కోసం పనిచేస్తావు. కాని అన్నదానం చేస్తున్నప్పుడు నువ్వు ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా, నిర్మలమైన మనస్సుతో, శుద్ధభక్తితో పనిచేస్తావు. భక్తులు ఈ ఆహారాన్ని 'మహాప్రసాదం'గా స్వీకరిస్తారు. భోజనం హోటల్‌లో కూడా దొరుకుతుంది. కాని ఈ అన్నదానం కేవలం భోజనం కాదు. అది "మహాప్రసాదం". ఆ విధంగా ప్రతీదీ, ప్రతిఒక్కరూ విరాళంగా ఇచ్చే దానంగాని, చందాగాని, సేవగాని మొదలైనవి కూడా 'సాధన' అవుతుంది". ఆ విధంగా స్వామీజీవారు అన్నదానం యొక్క ప్రయోజనాలను చెప్పేవారు.

స్వామీజీవారు "దేవుడు ఉన్నాడు, దేవుడంటే కేవలం ఊహ మాత్రమే అని కొంతమంది అనుకుంటున్నది సరికాదు" అని చెప్పారు. "నీవు దేవుణ్ణి ఏ పేరుతోనైనా, ఏ రూపంలోనైనా లేదా నిరాకారంగానైనా నమ్మవచ్చు. కాని ఇతరుల నమ్మకాలను నువ్వు తక్కువగా చూడరాదు. ప్రతియొక్కరిని ప్రేమించండి. ఒకరినొకరు గౌరవించుకోండి" అని చెప్పారు.

మనం స్వామీజీ గురించి మాట్లాడుటకు ప్రయత్నిస్తే అది మహాసముద్రంలో ఒక చిన్న నీటి బిందువులా ఒక దృక్కోణము మాత్రమే అవుతుంది. ఏదీ ముక్తసరిగా చెప్పలేము. స్వామీజీ ఎల్లలు లేని అనంతమైనవారు. మనకు తెలిసింది చాలా తక్కువ. తెలుసుకోవలసింది పొద్దులులేని ఆకాశమంత. మనం ఆయన పాదపద్మముల చెంత మోకరిల్లి వారి కృప, ఆశీర్వాదములకై ప్రార్థించాలి అంతే. ఆయన అమ్మలా మన చేయి పట్టుకొని దారి చూపుతూ మనల్ని నడిపిస్తారు.

మనందరినీ స్వామీజీ ఆశీర్వదించుగాక

స్వామీజీ పాదపద్మాలలో శ్రీ శివరుద్ర బాలయోగి. *

# శ్రీశ్రీశ్రీ శివబాలయోగీంద్రుల జీవిత చరిత్ర

**ప్రతి సంచికలోనూ స్వామీజీవారి జీవిత చరిత్రమును ధారావాహికగా ప్రచురించబడుతుంది**

ఎంతో మంది మహాయోగుల లాగానే శ్రీ శివబాలయోగి మహారాజ్ వారు కూడా పేదరికంలో పుట్టారు. పరమ శివుడు భిక్షాటన చేసి జీవిస్తాడు కాబట్టి తను అవతారము దాల్చినప్పుడు కూడా పేదవాళ్ళ మధ్యలోనే జన్మిస్తాడు. ఎందుకంటే సాధుస్వంగా ఈ భౌతిక సుఖాలతో ఆకర్షింపబడి తప్పుదారిలో పడ్డవారికంటే వీరి భక్తి చాలా సాధారణంగా మరియు దృఢంగా ఉంటుంది.

భారత దేశంలోని తూర్పు తీర ప్రాంతంలో పవిత్ర గోదావరీ నదీ తీరాన వెలసిన ఒక చిన్న పట్టణం ద్రాక్షారామం. ఇది ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ నుండి 30 కి.మీ. మరియు రాజమండ్రి నుండి 40 కి.మీ. దూరంలో ఉంది. ద్రాక్షారామం, పురాణప్రసిద్ధి గాంచిన పురాతన దేవాలయమైన భీమేశ్వరుడి ఆలయానికి ప్రఖ్యాతిగాంచింది. ఇక్కడి ఆలయంలో భీమేశ్వరుడు స్వయంభు లింగాకారంలో వెలసియున్నాడు. వట, బిల్వ వృక్షాలతో నిండిన ఈ విశాలమైన దేవాలయం చాలా ప్రశాంతంగా ఉంటుంది. దక్షప్రజాపతి ఇక్కడ యజ్ఞం చేశాడనీ, అందువల్ల ఇది దక్షవాటి అని పిలువబడేదని స్థల పురాణం. తన పతియైన శివుణ్ణి తన తండ్రి యజ్ఞానికి పిలువకుండా అవమానించిన కారణంగా, ఆ అవమానాన్ని సహించలేక దాక్షాయణి అగ్ని ప్రవేశం చేసి దేహత్యాగం చేసినప్పుడు తన శరీరమునుండి ఊడిపడ్డ 18 భాగాలు భారతదేశంలో అష్టాదశ శక్తి పీఠాలుగా వెలిశాయి. అందులో ఈ ద్రాక్షారామంలోని భీమేశ్వరాలయం కూడా ఒకటి. వేదవ్యాసుడు ఇక్కడే తపస్సు చేసి సిద్ధిని పొందాడని ప్రతీతి. ఇంతటి మహాత్యం కలిగిన ద్రాక్షారామ పట్టణానికి ఒక కిలోమీటరు దూరంలో పచ్చని చిన్నని వాటి మరియు కొబ్బరి తోటల మధ్య ఆదివారపేట అనే కుగ్రామం ఉన్నది. ఈ ఊరి పొలిమేరలో గోదావరి సాగునీటి కాలువ ప్రవహిస్తూ ఉంటుంది.

ఆదివారపేటలో దేవాంగ కులస్థులు ఎక్కువ. నేతపని వీరి వృత్తి. వ్యవసాయం కంటె ఎక్కువ నేతవృత్తి ఇక్కడివారికి జీవనాధారం. దోవతులు మరియు కాటన్ చీరలను నేసి పక్కనున్న పట్టణాల్లో అమ్ముతూ ఉంటారు. ఈ రోజుకి ఈ ఊరి స్థితిగతులు కొంచెం మెరుగుపడినా, 1930లలో చాలా దుర్భరంగా ఉండేది. విద్యుత్ సౌకర్యం గాని, టెలిఫోన్ గాని, డ్రైనేజ్‌గాని ఏ మౌలిక సదుపాయాలు లేక కేవలం ఒకే ఒక మట్టిరోడ్డుతో, అది కూడా బయట ప్రపంచానికి సంబంధం లేకుండా పచ్చని పరిసరాల మధ్య కుగ్రామముగా ఉండేది. శతాబ్దాలు గడిచినా ఈ ఊరి స్థితిగతులు గాని, ప్రజల ఆదాయంలోగాని ఏ మార్పు లేక పేదరికంలో జీవితం సాగించేవారు.

సుమారు శతాబ్దం కిందట ఆ ఊరిలో అల్లక భీమన్న నివసిస్తూ ఉండేవాడు. ఊరిలో అందరిలానే అతనిదీ నేత వృత్తి. భీమన్న చాలా ధార్మికత కలిగిన శివభక్తుడు. భీమన్నకు జ్యోతిశ్శాస్త్రంలో మంచి జ్ఞానం ఉండేది. ఊరి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ముహూర్తాల కోసం మరియు ఇతర శాస్త్రాల గురించి తెలుసుకోవడం కోసం భీమన్నను ఆశ్రయించేవారు. ఒక జ్యోతిశ్శాస్త్రంలో మాత్రమే కాకుండా ఆయుర్వేద శాస్త్రంలో కూడా మంచి నైపుణ్యం కలవాడతను. కేవలం నాడిని పట్టుకుని చూసి ఏ రోగమో చెప్పగలిగేవాడు.

భీమన్న మొదటి భార్య పుట్టినిల్లు బందారులంక. గోదావరీ నది అవతల, ఆదివారపేటనుండి 20 కి.మీ. దూరంలో గల ఒక లంక గ్రామం. ఆ దంపతులకు సంతానం కలగని కారణంగా భార్య సమ్మతితో భీమన్న హసన్‌బాద్‌కు చెందిన పార్వతమ్మను రెండవ వివాహం చేసుకున్నాడు. కాలక్రమేణా పార్వతమ్మ ఆరుగురు సంతానాన్ని కన్నది. అందులో ఇద్దరు చిన్నప్పుడే చనిపోగా, మిగిలిన నలుగురిలో మొదటి ఇద్దరు కూతుర్లు, ఒకరు పెద్దక్క ఇంకొకరు చిన్నక్క, వీళ్ళిద్దరి తరువాత కొడుకు చిన్నబాబు మరియు చిన్నబాబు తర్వాత అందరిలోనూ కనిష్ఠుడు సత్యరాజు. ఇతడే తరువాత 12 సంవత్సరముల కఠోర తపస్సు చేసి శ్రీశ్రీశ్రీ శివబాలయోగి మహారాజ్‌గా ప్రసిద్ధిగాంచాడు.

ఆదివారపేట ఒక పేదగ్రామం. అక్కడి ఇళ్ళు చాలావరకు మట్టితో కట్టిన గోడలతో, తాటాకుల పందిరితో గుడిసెలను పోలి ఉండేవి. సామాన్యంగా ఒకే ఒక గది మాత్రమే ఉండి, కుటుంబ సభ్యులందరూ అందులోనే నివసిస్తుండేవారు. ఒక చిన్న అడ్డుగోడ ఇంటి గదినీ, వంటింటిని వేరు చేస్తుంది.




ఇలాంటి పేదరికంలోనే నేతవృత్తిని తన జీవనాధారం చేసుకుని బ్రతుకుతున్న భీమన్న కూడా ఒకరు. భీమన్న మరియు తన తమ్ముడు చిన్న సత్యలింగం ఒకే ఇంటిలో మధ్యలో ఒక అడ్డుగోడ కట్టుకుని వేరు వేరు కాపురాలు ఉండేవారు. భీమన్న తన సగం ఇంటిలో ఒక మగ్గం కలిగివుండి చిన్నగదిలోనే ఒక మూలలో వంట గదిని ఏర్పాటు చేసుకుని తన భార్యా ముగ్గురు పిల్లలతో సంసారం సాగించేవాడు. ఇలాంటి పరిస్థితులలోనే పార్వతమ్మ తన ఆరవ సంతానమూ, అందరిలోనూ చిన్నవాడూ అయిన సత్యరాజుకి 1935వ సంవత్సరం జనవరి 24న, మధ్యాహ్నం 2-45 గంటలకి జన్మనిచ్చింది. ఈ బాలుడే కాలక్రమంలో "శ్రీశ్రీశ్రీ శివబాలయోగి మహారాజ్" గా ప్రఖ్యాతి గాంచాడు.

సత్యరాజు జన్మించిన కొంతకాలం తర్వాత అతని తండ్రి భీమన్న బాలుడి జాతకాన్ని తయారుచేశారు. అందులో బయటపడిన విషయం ఏమిటంటే, బాలుడికి రెండు సంవత్సరాల వయస్సు వచ్చినప్పుడు తానైనా చనిపోతానని అప్పుడు బాలుడు చాలా కీర్తివంతుడవుతాడని, లేక బాలుడైనా మరణిస్తాడని తెలిసింది. తరచూ పార్వతమ్మతో తమ చిన్న కుమారుడు సత్యరాజు చాలా కీర్తిమంతుడవుతాడనీ తమ కుటుంబానికి మంచి పేరు ప్రతిష్టలు తెస్తాడనీ, కాని, తాను మాత్రం అది చూడటానికి బ్రతికి ఉండనని అంటూ ఉండేవాడు. అదే నిజమై, 1937 జులై మాసంలో సత్యరాజుకి రెండున్నర ఏండ్ల వయసొచ్చినప్పుడు భీమన్న పరలోకగతుడైయాడు.

తన భర్త మరణానంతరం పార్వతమ్మకు ఇంటిని నిభాయించటం చాలా కష్టమయ్యింది. అందుకు తనే మగ్గాల మీద పనిచేసి చీరలను నేసేది మరియు దోసెలను వేసి అమ్మి, వచ్చిన డబ్బులతో తన ఇద్దరు కొడుకులనూ, కూతుర్లనూ పోషించేది. ఒక సంవత్సరం తరువాత పార్వతమ్మగారి తండ్రి గోలి సత్యం అదివారపేటకు వచ్చి, ఒంటరిగా జీవిత పోరాటం చేస్తున్న తన కూతురికి తోడుగా ఉండసాగాడు. అతను కూడా బీదవాడవడం చేత విధవరాలైన తన కూతుర్ని మరియు ఆమె సంతానాన్ని భరించడం చాలా కష్టమనిపించింది. అందువల్ల సత్యరాజు బడిలో చదువుకుంటున్నా, ఇంటి దగ్గర పనికూడా చేయవలసిన అవసరం ఏర్పడింది. రోజూ ఉదయం 5 గంటలకు లేచి స్నానం చేసిన తరువాత కొద్దిగా పెరుగన్నంతిని 10 గంటల దాకా మగ్గాల మీద పనిచేసేవాడు. ఆ తరువాత భోజనం

చేసి బడికి వెళ్ళేవాడు. సాయంత్రం నాలుగు గంటలకు బడి వదలగానే పిల్లలందరిలా ఆరు గంటలదాకా ఆడుకునేవాడు. తల్లి పిలవగానే వెళ్లి తమ తాతగారితో పాటు భోజనం చేసి ఒక గంటసేపు ఆ రోజు జరిగినవన్నీ తాతగారికి చెప్పేవాడు. మనవడు చెప్పినవి తాతగారు ఆసక్తిగా వింటూ అతనికి విలువైన సలహాలు ఇస్తూ ఉండేవారు. ఆ తరువాత రాత్రి ఏడు గంటల సమయంలో భజన జరుగుతూ ఉంటే ఆ భజనలో పాల్గొనేవాడు. లేకపోతే తిరిగి బయటకు వెళ్ళి స్నేహితులతో ఆడుకునేవాడు. ఆ సమయంలో పిల్లలందరూ తరచూ కత్తి, కర్రసాము నేర్చుకొని, అభ్యసించేవారు. ఈ ప్రాచీన కళలో సత్యరాజు చాలా నైపుణ్యాన్ని సంపాదించాడు. ఆ తరువాత పది గంటల ప్రాంతంలో పిల్లలంతా నిద్రపోయేవారు. పట్టుమని ఆరు సంవత్సరాలైనా నిండని ఆ పసివాడికి ఇదంతా నిజానికి చాలా కష్టమయిన జీవితం. కాని భారతదేశంలో ఉన్న పేదపిల్లలందరి జీవితమూ ఇలాంటిదే. ఇది పేదరికానికి ప్రాయశ్చిత్తం వంటిది."

**తాతగారి ప్రభావం:**

సత్యరాజు తన తాతగారిని గౌరవించి ప్రేమించేవాడు. ప్రతి సాయంత్రం కొంతసేపయినా, ఆయన చెప్పే ప్రాపంచిక సలహాలనూ, మంచి మాటలనూ, శ్రద్ధగా వింటూ గడిపేవాడు. ఆ విధంగా గోలి సత్యం తన ప్రియమైన మనవడి యొక్క శీలాన్ని, ప్రవర్తననూ ఎంతగానో ప్రభావితం చేసాడు.

భారతదేశంలో పేదరికం శతాబ్దాలుగా ఉన్నా, తక్కిన దేశాల్లోలాగ మన దేశ ప్రజలను అది కలుషితం చేయలేదు. నిజానికి అతి సంపన్నమయిన దేశాల్లో కంటే అతి పేద ప్రజలున్న గ్రామీణ భారతదేశంలో మంచి శీలం, ప్రవర్తన కనిపిస్తాయి. ఆ విధంగా గోలి సత్యం పేదవాడయినా, ఆత్మ గౌరవం, మర్యాద కలిగిన శీలవంతుడైన వృద్ధుడు. అతడు తరచూ తన కుటుంబ సభ్యులతో ప్రత్యేకించి చిన్న పిల్లలతో ఇలా అంటూ ఉండేవాడు. "పేదరికం, దురదృష్టమే కాని పాపం మాత్రం కాదు. అందువల్ల దాని గురించి సిగ్గుపడవలసిన అవసరం లేదు. ఎవరూ యాచించటం కానీ, ఇతరుల మీద ఆధారపడటం కానీ, ఇతరుల మొహమాటానికి లొంగటం కాని చేయరాదు. ప్రతివాడూ అనుసరించటానికి కష్టమయినా, గౌరవంగా, నీతిగా బ్రతకాలి. నిజాయితీ లోపాన్ని, అసత్యాన్ని ఎప్పుడూ దగ్గరకు రానీయకూడదు."

సత్యరాజు తాతగారిని దైవసమానంగా గౌరవించేవాడు. తాతగారు కూడా మనవడిని విపరీతంగా అభిమానించేవారు. అతనికి గొప్ప భవిష్యత్తు ఉన్నదని చెప్పేవారు. కాలం గడిచిన కొద్దీ సత్యరాజు తాతగారిని అతి విశ్వసనీయుడైన సన్నిహితుడుగా చూచేవాడు. ఆయన ఇచ్చిన సలహాలను తు.చ. తప్పకుండా పాటించేవాడు. ఆయన ఇచ్చిన ఆజ్ఞలను నిస్సంకోచంగా నిర్వర్తించేవాడు. దానికి ఉదాహరణే ఈ క్రింది కథ.

ఒక రోజు పనిమీద సత్యరాజు రామచంద్రాపురం వెళుతున్నాడు. మనవడు వెళుతున్నప్పుడు తాతగారు ఇలా చెప్పారు. తమకు రామచంద్రాపురంలో చాలా బంధువులు ఉన్నారుకానీ, వారందరూ తమయందు గౌరవం కానీ, మర్యాద కానీ చూపించక పోవచ్చుననీ, అందువల్ల పిలవకుండా వారి ఇళ్లకు వెళ్ళకూడదని, వెళితే వారిముందు హుందాగా ప్రవర్తించాలని చెప్పి పంపారు. సత్యరాజు పని ముగించుకునే సమయానికి రాత్రి 11 గంటలయ్యింది. మామూలు పద్ధతిలో అయితే మంచి భోజనం, సుఖనిద్ర లభించటానికోసం ఎవరో ఒక బంధువు ఇంటికి వెళ్ళి రాత్రి గడిపి ఉదయం తిరిగి వచ్చేవాడు. కాని తాతగారి సలహా గుర్తుంచుకుని, ఆ ఎనిమిదేళ్ళ పసిబాలుడు, ఇబ్బందులను చూసుకోకుండా, ఒక మూసివున్న దుకాణపు వరండాలో ఆ రాత్రి గడిపి, మర్నాటి ఉదయం ఇంటికి తిరిగివచ్చాడు. జరిగినదంతా తాతగారికి చెప్పినప్పుడు ఆయన కుర్రవాడి నిగ్రహానికి, పట్టుదలకూ ఎంతో సంతోషించి, తన మనవడికి నిజంగా చాలా మంచి భవిష్యత్తు ఉన్నదని దృఢపరచుకున్నారు.

స్వామీజీవారు భక్తులకు తన తాత గోలిసత్యం భయాన్ని ఎలా ఎదుర్కొవాలన్నది ఏ విధంగా నేర్పించారన్న దానికి ఉదాహరణగా ఈ క్రింది కథ చెప్పేవారు:

స్వామీజీ చిన్నప్పుడు చాలా ఎత్తైన వంతెన నుండి గోదావరి నదిలోకి దూకేవారట. ఇలా దూకడాన్ని స్వామీజీ ఎంతగానో ఇష్టపడేవారు. ఒకసారి తన తల్లి పార్వతమ్మగారు ఇలాంటి సాహస కార్యాలు ఇంకెప్పుడూ చేయనని ప్రమాణం చేయమన్నారు. కాని అందుకు అతను ప్రమాణం చేయలేదు. ఇలాంటిదే ఇంకొక సందర్భంలో సముద్రంలో ఈత కొట్టడానికి వెళ్ళినప్పుడు, అది చాలా ప్రమాదమని అక్కడి మత్స్యకారులు అతడిని నిరోధించడానికి ప్రయత్నించారు.


కాని సత్యరాజుకి సముద్రంలో ఈదడమంటే చాలా చాలా ఇష్టం. కేవలం అతడి తాతగారు మాత్రమే అపాయములను ఎదురించి పోరాడడానికి ప్రోత్సహించేవారు.

స్వామీజీ చెప్పిన ఇంకొక కథ తను ఆరేళ్ల బాలుడుగా ఉన్నప్పటిది. ఒకసారి తను బడినుండి వస్తున్నప్పుడు దారిలో ఒక మహిళను ఊరేగింపుగా బ్యాండు భాజాలతో తీసుకెళ్తున్న దృశ్యం చూశాడు. అక్కడ ఏమి జరుగుతున్నదని వారిని అడిగాడు. నిజానికి అక్కడ చనిపోయిన మహిళను శ్మశానానికి తీసుకెళుతున్నారు కాని బాలుడు అడిగినప్పుడు భయపడతాడని వారు పెళ్ళి ఊరేగింపు అని చెప్పారు. ఒక పెద్ద మనిషి అతడిని అక్కడినుండి వెళ్ళిపొమ్మంటే బాలుడు వినక వారిని వెంబడించాడు. కొంచం దూరంనుండి అక్కడ జరుగుతున్న శవసంస్కారాన్ని చూశాడు. ఇంకా ఆ కార్యక్రమం జరుగుతుండగానే అతను నిద్రకు ఉపక్రమించాడు. ఈ లోపల శవాన్ని పూడ్చి, మిగతా కార్యక్రమాలన్నీ ముగిశాక శవం తరపువాళ్ళు వెళ్ళిపోగా, గుంత తవ్వేవాళ్ళు కూడా తమ పని పూర్తిచేసి అక్కడి నుండి వెళ్ళిపోయారు. దగ్గర దగ్గర మధ్యరాత్రి సమయంలో పిల్లవాడు నిద్రనుండి మేల్కొని చూడగా చిమ్మ చీకటిగా శ్మశానం మొత్తం నిశ్శబ్దంగా, కేవలం తనొక్కడే అక్కడ ఉన్నట్లు గుర్తించాడు.

ఇలాంటి శ్మశానంలో కుక్కలు, నక్కలు మరియు ఇతర క్రూర జంతువులు అప్పుడే పూడ్చిన శవాన్ని తినడానికి రావడం అసాధారణ మేమీ కాదు. నక్కలు పెద్ద శబ్దంతో ఊళలు పెడుతూ వస్తున్న శబ్దానికి సత్యరాజు మేల్కొన్నాడు. సత్యరాజుని చూసిన నక్కలు మంచి ఆహారం దొరికిందని అనుకుని ఉండవచ్చు. కాని సత్యరాజు కించిత్తు భయపడక, పక్కన పడిఉన్న ఒక పొడుగాటి ఇనుప గొట్టాన్ని తన చేతికి అందుకుని నక్కల్ని భయపెట్టాడు.

సత్యరాజు చీకట్లోనే ఇంటికి దారిని వెతకాల్సి వచ్చింది. చుట్టూ తిరిగి చివరికి బయటకు వెళ్ళే దారిని కనుగొన్నాడు. కాలువ దగ్గరికి వచ్చే సరికి రెండు దారులు కలిసే చోటు ఎదురవ్వడంతో కుడివైపుకి వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. కొంత దూరం సాగిన తర్వాత తను బాగా ఎరిగిన ఊరి సమీపాన గల మైదానం కనిపించింది. కాలువ దగ్గరికి వచ్చేసరికి అక్కడ గుంత తవ్వేవాళ్ళు స్నానంచేస్తూ ఊరిలోకి వెళ్ళే ముందు చేసే శుద్ధి కార్యక్రమం చేసుకుంటున్నారు. శ్మశానంలో ఒంటరిగా తాను అనుభవించిన ఆ భయానకమైన అనుభవం నుండి బయటపడి, అక్కడినుండి పరుగెత్తుకుంటూ ఇంటికి చేరుకున్నాడు.

తాతగారికి జరిగిన సంగతిని చెప్పినప్పుడు, పసిబాలుణ్ణి చూసి కూడా అక్కడే వదిలేసి వచ్చినందుకు గుంత తవ్వేవాళ్ళ



తాతగారి సత్యం ప్రోత్సాహంతో బాల్యంలోనే సత్యరాజు సముద్రంలో ఈదుతున్న దృశ్యం.

మీద అయనకు తీవ్రమైన కోపం కలిగింది. పిల్లవాడికి చెప్పి, భయపడవద్దని భోజనం చేయించాడు. తరువాత గోలిసత్యం ఆ ఊరి ముఖ్యస్థుడైన తమ సమీప బంధువుకి వారి మీద ఫిర్యాదు చేయగా అతను వాళ్ళను బాగా చీవాట్లు పెట్టారు.

ఆ తరువాత సుమారు రెండు నెలలకు సత్యరాజు పక్క ఊరి వాళ్ళ ఊరేగింపు వెళుతుండటం చూశాడు. ఈ సారి అది ఆ గ్రామములో పేరు మోసిన రౌడీ అంతిమయాత్ర. శవ సంస్కారానికి ముందు మట్టిని వేసే ఆచారం అక్కడి ఊరిలో ఉంది. అలా అందరూ మట్టి వేయడం మొదలుపెట్టారు. సత్యరాజు ఒక పెద్ద రాయిని తీసుకుని గురిచూసి విసిరాడు. అది శవం తలని చీల్చి గాయపరిచింది. గ్రామస్థులు విచారపడి అలా చేసినందుకు ఆ శవం తిరిగి వచ్చి నిన్ను పట్టుకుంటుందని బాలుడిని భయపెట్టారు.

సత్యరాజు ఇంటికి పారిపోయి తాతగారికి జరిగిన విషయాన్ని మరియు గ్రామస్థులు భయపెట్టిన సంగతిని చెప్పాడు. చచ్చిపోయిన శవం తిరిగి వచ్చి పట్టుకుంటుందని బాలుడు చాలా భయపడ్డాడు. గోలిసత్యం బాలుడికి ధైర్యం చెప్పి అతడి భయాన్ని పోగొట్టడానికి ఆ రాత్రి శ్మశానానికి తీసుకువెళ్ళాడు. సత్యరాజు అక్కడ కుక్కలు, నక్కలు శవాన్ని పీక్కు తింటుండటాన్ని చూసాడు. శవం గురించి భయపడవలసిన అవసరం లేదని నిశ్చయపరచుకున్నాడు.

ఆ రోజు నుంచి మళ్ళీ ఎప్పుడూ తను భయపడలేదని స్వామీజీ చెప్పారు. చాలా మంది దయ్యం గురించి భయపడుతూ ఉంటారు. ఒక నిర్దిష్టమైన స్థలంలో రేగ చెట్లలో దయ్యం ఉంటుందని జనాలు నమ్ముతారు. ఏది ఏమైనా సత్యరాజు భయపడకుండా ఉండటం నేర్చుకున్నాడు. దానికి జనులు నాకు దయ్యాలంటే భయం లేదు అని పందెం కాసేవారు. జనాలు అది నమ్మక, పందెం కాసేవారు. సత్యరాజు భయపడకుండా ఒంటరిగా రాత్రి దయ్యాల చెట్టు దగ్గరికి వెళ్ళి, తిరిగి వచ్చి వారి నుంచి పందెం గెలిచినందుకు డబ్బులు తీసుకునేవాడు. (సశేషం)



శ్మశానానికి వెళ్ళి వచ్చి భయపడిన సత్యరాజుని తాత పిలిచి ధైర్యం చెప్తున్న దృశ్యం.

3వ పేజీ తరువాయి...



బెంగుళూరులోని బన్నెరుఘట్ట ఆశ్రమములో స్వామీజీ దర్శనార్థం పోటెత్తిన భక్తజనం

గతంలో ఎన్నడూ చేయబడని విధముగా బహు విపులముగా, సమగ్రముగా దాఖలా చేయబడినందున శివబాలయోగివారి తపస్సు మరియు వారి జీవనము ప్రాచీన ఋషుల సాంప్రదాయానికి ఒక బహిరంగ ప్రదర్శన. ఇతర యోగుల కంటే శివబాలయోగి తపస్సు గురించి అత్యధిక సమాచారాన్ని కలిగి ఉండటం మన సౌభాగ్యం. గత శతాబ్దికి చెందిన యోగులవలె కాక, శివబాలయోగి భారతదేశములో విరివిగా మరియు పశ్చిమ దేశాలలో కూడా పర్యటించారు. సాంప్రదాయంగా యోగులు జన సమూహానికి దూరంగా వుంటారు. తమ భౌతిక జీవితకాలంలో విస్తృతంగా గుర్తింపు కలిగియుండరు. శిష్యులు కొంతమంది మాత్రమే అది కూడా ఎంపిక చేయబడినవారై ఉండేవారు. ఇతర యోగులతో పోల్చి చూస్తే శివబాలయోగి కోట్లాదిమందితో భౌతిక సంబంధం ఏర్పరచుకొనుటకు పర్యటించారు. విరివిగా ధ్యానదీక్షనూ మరియు ఆధ్యాత్మిక అనుభవాలనూ ప్రసాదించారు, ప్రసాదిస్తూనే ఉన్నారు. శివబాలయోగివారి ఇంతటి సాంఘిక జీవితము యోగుల మహాత్యమును మరియు వారి సందేశమును గ్రహించుటకు మనకు ఉపకరిస్తుంది.

స్వామీజీవారు తమ భౌతిక శరీరము ఉన్నంతవరకూ తమ నిస్వార్థమైన సేవను అవిశ్రాంతంగా కొనసాగిస్తూనే ఉన్నారు. 1994 మార్చి 28న 'యోగనిద్ర' ద్వారా స్వామివారు 'మహాసమాధి' చెందారు. ఆయన ఎన్నడూ తమ భౌతిక శరీరమునకు పరిమితం కాలేదు. దేహత్యాగం చేసినప్పటికీ భక్తులకు ఎల్లకాలం అందుబాటులో వుంటూ, ఆశీర్వదిస్తూ, దర్శనమిస్తూనే ఉన్నారు. యోగులందరూ కూడా ఈ విధంగా భక్తులందరికీ దర్శనమిస్తూ, ఆశీర్వదిస్తుంటారు. యోగులు మరణించరని స్వామీజీ నొక్కి వక్కాణించారు. యోగులు శాశ్వతంగా వ్యక్తమవుతూ దీవిస్తూ వుంటారు.

శ్రీస్వామీజీవారు మహాసమాధి చెందిన అనంతరం కూడా తమ సేవను కొనసాగిస్తున్నారనడానికి మన భారతదేశం మరియు ప్రపంచవ్యాప్తంగా వున్న అనేక లక్షలమంది భక్తులు, వారి అనుభవాలే నిదర్శనం. మహాసమాధి అనంతరము మరిన్ని ఆశ్రమాలు మరియు ట్రస్టులు భారతదేశంలో మరియు విదేశాలలో స్థాపించబడి సంవత్సరం పొడవునా అనేక కార్యక్రమాలు అద్భుత జరుపుకోబడుతున్నవి. ఇటువంటి ఈ మహాత్ముని నిరుపమ జీవితము, ఆయన తపస్సు మరియు ఆయన సాగిస్తున్న 'మిషన్' గురించి మన తెలుగువారందరికీ తెలియపరచాలన్న కుతూహలంతో ఈ పత్రిక ప్రచురిస్తున్నాము. *

# ధ్యానదీక్ష



శ్రీ శివబాలయోగివారి ఉద్యమంలో ప్రధాన భాగం ప్రజలను ధ్యానమార్గంలో పెట్టడం. దర్శనము, భజనలు, ఆధ్యాత్మిక భావస్థితులు మొదలైనవి మనసును శుభ్రపరచి, శారీరక, మానసిక రుగ్మతలను రూపుమాపి ధ్యాన మార్గంలో నడచుటకు ప్రోత్సహించి సంసిద్ధులను చేయగలవు. ధ్యానం ద్వారా ఆత్మ చైతన్యం అభివృద్ధి చెందుతుంది. "ఈ శరీరమే నేను" అనే తప్పుడు భావన తొలగుతుంది.

శ్రీ శివబాలయోగి స్వామీజీ బోధించే ధ్యానపద్ధతి అత్యంత ప్రభావశాలియైన ధ్యాన ప్రక్రియ అని చాలా మంది అభిప్రాయం. ధ్యాన దీక్ష సమయంలో స్వామివారిచ్చే ఆశీస్సులు ఏ అనుభవమూ లేని కొత్తవారు సైతం ధ్యానం బాగా చేసుకొనుటకు తోడ్పడతాయి. కుల, మత, సమ్మతాలతో సంబంధం లేకుండా స్వామీజీ అందరికీ ధ్యానదీక్షనిస్తారు. ఈ పద్ధతిలో మంత్రం ఏదీ ఉపయోగించరు. ఏ ఒక్క మత సంప్రదాయానికి బద్ధులై ఉండవలసిన అవసరము లేదు. ధ్యానదీక్ష సమయంలో స్వామీజీ అనుగ్రహించే ఆధ్యాత్మిక శక్తి మరియు ఆ ధ్యానము యొక్క సాధన భక్తులు అంతకు ముందే అవలంబించిన వేరే ఆధ్యాత్మిక సంబంధాలకు గానీ ప్రమాణాలకు గానీ ఏ విధంగా అడ్డు రావు. మనకు నచ్చిన ఆధ్యాత్మిక మార్గంలో సాధన చేసి, అభివృద్ధి చెందడానికి ఆయన ఆశీస్సులు ఉపయోగ పడతాయి.

ధ్యానసాధన చేస్తూ ఉంటే మీకు గొప్ప సంతోషము, ఆనందము కలుగుతాయి. ధ్యానంలో కలిగే ఆనందంలాంటిది ఈ భూమి మీద మరెక్కడా లేదు. బాహ్యంలో మీరుపొందే అన్ని రకాల ఆనందాలు మీరు ధ్యానం చేసేటప్పుడు పొందే ఆనందానికి ఏమాత్రం సరితూగలేవు.

**స్వామీజీ సందేశం :**

ధ్యానమంటే మన మనస్సును అదుపులో ఉంచుకోవడం. ధ్యానం ద్వారా మనశ్శాంతి లభిస్తుంది. రక్తపోటు తగ్గుతుంది. ఆరోగ్యం బాగుపడుతుంది. జీవితంలో మనం చేసే పనులు ఇంకా బాగా చేయగలుగుతాము. మన మనస్సు మనకు బాగా అర్థం అవుతుంది. ఈ రకమైన అవగాహన ద్వారా ప్రతివారు ఇంకా బాగా, సమర్థంగా పనిచేయగలుగుతారు. ధ్యానం ఆందోళనను తగ్గిస్తుంది. ధ్యానం బాగా సాధన చేయడం వల్ల మీరు ఏ వ్యక్తులతో మసలుతారో వారిని అర్థం చేసుకోవడం బాగా సులువవుతుంది. మన పరిసరాలకు సంబంధించిన స్పృహ, సున్నితత్వం మనలో పెరుగుతాయి. పరిస్థితులను మార్చే శక్తి కూడా మనకు వస్తుంది. ధ్యానంలో బాగా అభివృద్ధి సాధించాక దైవ సాక్షాత్కారం కలుగుతుంది. మీకు అనుభవాలు కావాలి. అవి స్వామీజీ ఇస్తారు. స్వామీజీ మీకు బోధిస్తారు. స్వామీజీ ధ్యేయం అదే. ధ్యానంలో మీకు సహాయపడటం స్వామీజీ కర్తవ్యం. ప్రజలను మార్చడానికే స్వామి ఇక్కడ ఉన్నది. మొదట భక్తులు స్వామి దగ్గరకు వస్తారు. దర్శనం చేసుకుంటారు. స్వామీజీ కేసి చూస్తారు. ఆ విధంగా మొదలవుతుంది కథ. అప్పుడు స్వామి వారికి ధ్యానం చేయడం నేర్పుతారు. ధ్యానం చేసేలా చేస్తారు. వారి సందేహాలు అన్నీ తొలగిపోతాయి. కాలక్రమేణ వారుకూడా స్వామీజీలా అయిపోతారు.

ఆధ్యాత్మిక సాధన నేర్పడానికి, ఆందోళనను తగ్గించడానికి, ప్రశాంతతను చేకూర్చడానికే స్వామీజీ వచ్చారు. ఆందోళన కారణంగా మీకు మీరు ఎన్నో సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. మీ దగ్గర అణుబాంబులు ఉన్నాయి. ఎన్నో రకాల విషాలను తయారు చేసుకున్నారు. ఈ భూగోళానికి మీరు చేసిన చెడు అంతటినీ తొలగించి స్వస్థత చేకూర్చాలంటే ధ్యానం ఒక్కటే మార్గము. మనుష్యులందరిలోనూ ఆందోళనలు తగ్గించగలిగితే అప్పుడు ఒకరితోనొకరు మాట్లాడుకోగలుగుతారు. దాని ద్వారా ఈ భూలోకానికి రాబోయే ఆపదలను రాకుండా నివారించ గలుగుతారు. రోజూ ఒక గంట ధ్యానం చేస్తే మనస్సు అధీనంలోకి వస్తుంది. అప్పుడు ధ్యానం చేసే సమయం దానంతట అదే పెరుగుతుంది. ధ్యానసాధన కొనసాగిస్తే దానంతట అదే సమాధి స్థితి కలుగుతుంది. ధ్యానసాధన చేస్తూ ఉంటే మీకు గొప్ప సంతోషము, ఆనందము కలుగుతాయి. ధ్యానంలో కలిగే ఆనందంలాంటిది ఈ భూమి మీద మరెక్కడా లేదు. బాహ్యంలో మీరుపొందే అన్ని రకాల ఆనందాలు మీరు ధ్యానం చేసేటప్పుడు పొందే ఆనందానికి ఏమాత్రం సరితూగలేవు.


*

# మనం భజన చేసే ప్రతి పర్యాయం దేవుళ్లు అక్కడ ఉంటారు

స్వామీజీవారే స్వయంగా చెప్పినట్లుగా 'స్వామీజీ మిషన్'లోని ఐదు ముఖ్య అంశాలలో దర్శనము, వీభూతి, ధ్యానదీక్ష, భావసమాధితో పాటు భజన కూడా ఒకటి. కాబట్టి స్వామీజీవారి అన్ని ఆశ్రమాలలోనూ మరియు భక్తసంఘములలోనూ నిత్యం భజన జరుగుతూ ఉంటుంది. స్వామీజీవారు భజనను కేవలం ప్రోత్సహించటమే కాక, తను ఏ కార్యక్రమమందైనా తమ సన్నిధిలో తప్పక భజనలు పాడించేవారు. భజనకు అంతటి ప్రాముఖ్యతను ఇచ్చేవారు. స్వామీజీవారి మహాసమాధి అనంతరం కూడా ఇప్పటికీ ఇదే పద్ధతిని భక్తులు కొనసాగిస్తున్నారు.

భజన అనేది ఒక హిందీ భాష పదం. దానర్థం దేవుడి నామాన్ని పఠించడం. వివిధ రూపములలో ఉన్న దేవుళ్లను, దేవతలను, గురువును భక్తితో స్తుతిస్తూ పాడే పాటలే భజనలు. అవి శ్రావ్యమైన స్వరంతో, సరళంగా, భగవంతుడి పలు నామములను తరచూ పునరుచ్ఛరించుకునే విధంగా ఉంటాయి. సాంప్రదాయికంగా భక్తులందరూ సామూహికంగా ఏర్పడి పాడుకునేది భజన. అయినప్పటికీ ఒకే గాయకుడు పాడే భక్తి పాటలనూ కూడా భజనలుగా చెప్పుకుంటారు. సాధారణంగా ఒక వ్యక్తి పంక్తి తరువాత మరియొక పంక్తిని పాడుతుంటే మిగిలినవారు అతను పాడిన పంక్తులను తిరిగి బృందగానంగా పాడుతారు. సంగీత పరికరములైన తబల, డోలక్, మృదంగం, తీగలతో కూడిన పరికరములు మరియు హార్మోనియం మొదలైనవి భజనలకు శోభను సంతరించుకునేలా చేస్తాయి. దేవుడి నామములలో ఉన్న మాధుర్యాన్ని, దైవత్వాన్ని హృదయానికి హత్తుకునేలాగ చెయ్యటంలో ఈ లయబద్ధమైన సంగీతం తోడ్పడుతుంది.

భక్తి మార్గమునకు సంబంధించిన భాగంగా అన్ని ఆధ్యాత్మిక సాంప్రదాయాలలో కూడా సిక్కులతో పాటు, క్రైస్తవులు, ముస్లింలు, బౌద్ధమతస్థులు భజనలను పాడటం సాధన చేస్తారు. భారతీయ సాంప్రదాయంలో మహాత్ములెందరో భజనలకు సుప్రసిద్ధులు. అలౌకిక నారద మునీంద్రులు విష్ణువుయొక్క నామాన్ని నిరంతరం స్తుతిస్తూనే ఉంటాడు. హనుమంతుడు అవిశ్రాంతంగా రామనామాన్ని స్తుతిస్తాడు. అతని ప్రతీ రోమం ఆ దివ్య రామనామాన్ని


భజనలో భావస్థితిలో ఉన్న శ్రీ చైతన్య మహాప్రభువు

స్తుతిస్తూనే ఉంటుందనేది లోకవిదితం. ఈ మధ్య కాలంనాటి గాయకులైన చైతన్య మహాప్రభు, మీరాబాయి, త్యాగరాజు, రామదాసు, తుకారం మొదలైనవారందరూ భజన చేసి, తరించిన వారే. జ్ఞానమార్గాన్నే సాధించి, బోధించినవారిలో ప్రముఖుడుగా చెప్పుకోబడే ఆదిశంకరాచార్యులు కూడా భజన యొక్క ఆధ్యాత్మిక విలువను ప్రకటించిన విషయం అందరికీ తెలిసినదే. (భజ గోవిందం....)

**భజనలు – భావం (భావలీల) :**

భావం భక్తులలో ప్రత్యక్షంగా అనుభవమయ్యే ఆధ్యాత్మిక పారవశ్యం. భావం ఉన్నతమైన దివ్య ఆత్మల ప్రేరణ మరియు వారి స్పష్టమైన రూపం. భజనలు లేనప్పుడు కూడా భావం ప్రత్యక్ష ప్రమాణం అయినప్పటికీ స్వామీజీ కార్యక్రమములు చూసిన మనకు, భజనలకూ మరియు భావమునకు మధ్య అవినాభావ సంబంధం ఉందనడం సుస్పష్టం. భజనలు ఎంత ఎక్కువ చురుకుగా సాగుతాయో, అంత ఎక్కువగా భక్తుల భావలీల ప్రకటితమవుతుంది. భజనయొక్క లోతు, తీవ్రత మరియు భావంలో ఉన్న భక్తుల సంఖ్యను బట్టి భజనయొక్క విజయం, నైపుణ్యాన్ని నిర్ణయిస్తారు.

**భగవంతుడిని ఒక ప్రత్యేక రూపంలో ఆహ్వానించడమే భజన. భగవంతుడి వివిధ పేర్లు, రూపములు విశేష గుణములు మరియు స్వభావములతో కూడి ఉంటాయి. మనమందరం చూడలేకపోయినా, మనకు అనుభవం లేకపోయినా ఒక రూపానికి సంబంధించిన భజన చేసినప్పుడు భగవంతుడు ఆ సూక్ష్మ రూపంలో అక్కడ ఉంటాడు.**

**కొన్ని మార్గదర్శనాలు :**

1983 నుండి దశాబ్దానికి పైగా బెంగుళూరులో గల స్వామీజీ ఆశ్రమంలో స్వామీజీతో పాటు నివసించే అదృష్టం నాకు దొరికింది. స్వామీజీ సమక్షంలో ప్రతీ సాయంకాలం ఆశ్రమంలో భజనలు చేసేవాళ్ళం. భజనల గురించి స్వామీజీవారే స్వయంగా ఇచ్చిన సలహాలు మరియు సూచనలను ఈ క్రింద వివరించబడినవి :

1) భజనలు జరుగుతున్నప్పుడు భజనలో ప్రత్యక్షంగా పాల్గొనని వారితో సహా అందరూ మాట్లాడుట గాని, ప్రసంగించుటగానీ నిషేధించేవారు.

2) పాటకు పాటకూ మధ్య ఎక్కువ వ్యవధి ఇవ్వకుండా వెంటనే ఒకరి పాట పూర్తవగానే ఇంకొకరు ప్రారంభించాలి.

3) పాటను పాడటానికి గాని మరియు సంగీత పరికరములను వాయించుటకు గాని ఇష్టపడే ప్రతి ఒక్కరికీ అవకాశం ఇవ్వాలి. ప్రతీ సాయంకాలం ఆశ్రమంలో భజనలు జరుగుతున్నప్పుడు నన్ను మళ్ళీ మళ్ళీ పాడమని ప్రోత్సాహించేవారు. ప్రతీ సాయంకాలం 3 మరియు 4 పాటలు పాడి ముగించేవాడిని. ఫలితంగా కొంత మందికి ఒక్క పాట కూడా పాడే అవకాశం దొరికేది కాదు. నా గురించి ఫిర్యాదు చేయగా స్వామీజీ "పాడుటకు ఇష్టపడే ప్రతి ఒక్కరికీ అవకాశం దొరికేవరకూ ఎవరూ రెండో పర్యాయం పాడకూడదు" అని నియమం విధించారు. మేమందరమూ విధేయతతో స్వామీజీ నియమాన్ని పాటించాము. ఫలితంగా ప్రతి ఒక్కరికీ ప్రతిరోజూ పాడే అవకాశం లభించి, ప్రతిఒక్కరూ చక్కగా పాడేవారము. అలా తక్కువ కాలంలోనే మా బృందమంతా అద్భుతంగా అభివృద్ధి చెందింది.

4) స్వామీజీ సూచించిన పాటల క్రమము గణేశుడితో ప్రారంభమవుతుంది. గురువు మీద పాటలు, శివుడి మీద పాటలు దానిని అనుసరిస్తాయి. తర్వాత మిగతా దేవుళ్ళయిన అంటే రాముడు, కృష్ణుడు వంటివారు. ఆ తర్వాత అమ్మవారి, సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయ, చివరికి ఆరతి క్రమముతో ముగుస్తాయి.

5) 1961వ సంవత్సరం స్వామీజీ తపస్సు ముగించిన కొంతకాలం తర్వాత కొంతమంది భక్తులకు స్వామీజీ 'లయ' నేర్పారు. అదే తాళంను ఇప్పటికీ అనుసరిస్తారు.

1-1, 2,3, 1-1, 2,3..... తాళములలో ప్రారంభించాలి (మొదటి కాలం)

1,2, 3-1, 2,3-1,2,3........... వేగాన్ని పెంచి చివరగా (రెండవ కాలం)

1,2, 1,2, 1,2 వేగం కలిగి ఉంటాయి. (మూడవ కాలం)

శ్రీశ్రీశ్రీశివబాలయోగి మహారాజ్ వారి ఏ భజన క్యాసెట్లలోగాని, సీడీలలో గాని ఇది గమనించవచ్చును.

6) చాలా పాటలు ఈ పైన చెప్పిన విధంగా మూడు కాలాలలో పాడతారు. కాని కొన్ని పాటలు నెమ్మదిగా, కొన్ని వేగవంతంగా పాడతారు. తక్కువ వేగంతో పాడే పాటలతో భజన ప్రారంభించి వేగాన్ని పెంచుకునే పాటలను ఎంచుకోవాలి. వేగవంతంగా పాడే పాటలను పాడి తర్వాత నెమ్మదిగా పాడే పాటను పాడితే "శక్తి" (Energy) పడిపోతుంది. స్వామీజీ ఒకసారి భజనలు పాడే విధానాన్ని గేర్లతో కూడిన వాహనం నడిపించడంతో పోల్చారు. మొదటి గేర్‌లో ప్రారంభించి నెమ్మదిగా పై గేర్లను మారుస్తూ వేగాన్ని పెంచే విధంగా భజనలను కూడా నెమ్మదిగా ప్రారంభించి వేగాన్ని పెంచాలి.

**ఈ క్రింది సూచనలు, వివరణములు, స్వామీజీవారి సలహా, శిక్షణపై ఆధారపడి రూపొందించినటువంటి పాఠ్యక్రమం:**

1) పాటల క్రమానుసారానికి సంబంధించి దేవుడు/దేవికి విన్నవ పాటలు పాడాలనుకుంటే అన్నింటినీ ఒకదాని తరువాత మరియొకటి ఉంచుకోవాలి. ఉదాహరణకు ఒకటి రాముడి మీద, తరువాత శివుని మీద, మరియొకటి మళ్ళీ రాముడి మీద పాడకూడదు. భగవంతుడిని ఒక ప్రత్యేక రూపంలో ఆహ్వానించడమే భజన. భగవంతుడి వివిధ పేర్లు, రూపములు విశేష గుణములు మరియు స్వభావములతో కూడి ఉంటాయి. మనమందరం చూడలేకపోయినా, మనకు అనుభవం లేకపోయినా ఒక రూపానికి సంబంధించిన భజన చేసినప్పుడు భగవంతుడు ఆ సూక్ష్మ రూపంలో అక్కడ ఉంటాడు. మనం ఆహ్వానించినటువంటి భగవంతుడి పేరు లేదా రూపాన్ని మనం వెంటనే మార్చినప్పుడు భావలీలలో ఉన్నవారికి అవరోధం ఏర్పడటం అనేది తరచూ సంభవించే ప్రమాణం.

2) భగవంతుడికి ఫలం (Fruits) ముక్కలను గాని లేదా చివరకు బిస్కెట్లను గాని, చాక్లెట్లను గాని తప్పక అర్పించి భజన సమావేశంలో ఉన్నవారికి, సాధన చేసేవారికి పంచిపెట్టాలి. నన్ను నమ్మండి... మీరు భజన చేసే ప్రతి పర్యాయం దేవుళ్ళు అక్కడ ఉంటారు.

3) ఒకే పాట లేదా భజన 10-15 నిమిషాలు పాడటం అనేది చాలా విస్తృత అని నేను భావిస్తాను. భజనలు సంక్షిప్తంగా ఉంటే అది ఆసక్తికరంగా, ఆనందంగా ఉండేలాగ సహాయపడుతుంది.

4) ఏకాంతంగా చేసే ధ్యానంలా కాకుండా భజన బృందంగా చేసే సాధన. తాళం వేసేవాళ్ళు కొద్దిగా తప్పుగా వేసినా, లేదా బృందగానంలో ఎవరైనా అపశ్రుతిలో పాడినా భజన అంత అందంగా రాదు. ఇక్కడ ప్రతిఒక్కరి సహాయ సహకారములతో సంఘటితంగా కలిసి పనిచేయాల్సి ఉంటుంది. భజన బృందం మొత్తం తమ మనస్సుని దేవుడి మీద పెట్టి, అదే సమయంలో లయ, తాళాలను గమనిస్తూ ఉంటూ భజనలోని మాధుర్యాన్ని అనుభవిస్తూ దైవత్వాన్ని పొందుతారు. కాబట్టి అది అంకితభావమైన సాధన.

5) చివరగా మరియు ముఖ్యంగా మనం గమనించాల్సినదేమిటంటే, ఈ నిబంధనల పరిరక్షణ కొరకు సరదా సంతోషాలను సడలించకూడదు. భజన పాట పాడే వ్యక్తి, బృందం దానిని ఆనందించకపోతే శ్రోతలు దానిని ఎలా ఆనందిస్తారు? ❋


శుభాభినందనలతో...

రైతులకు గమనిక

# లో వోల్టేజిలో ఎక్కువ నీరు!!



లైన్ వోల్టేజ్ 150 కంటే తక్కువ వచ్చినా 415 వోల్టేజ్ పొందవచ్చును

# పవర్ ప్లస్ వోల్టేజ్ రెగ్యులేటర్లు

- పంపుసెట్లు మరియు మోటర్ల సామర్థ్యాన్ని పెంచును.
- లైన్‌లో చిట్టచివర ఉన్న మోటార్లకు ఇది తప్పనిసరి.
- అధిక నీరు, అధిక దిగుబడిని పొందవచ్చు.
- అత్యాధునిక సాంకేతికతతో నిర్వహించబడినవి.
- దీర్ఘకాలం మన్నిక, తక్కువ ధర మరియు గ్యారంటీ గలవి.
- వ్యవసాయానికి, గృహ అవసరాలకు, పరిశ్రమలకు



# శ్రీనివాస పవర్ సిస్టమ్స్

5-5-150, లాలాగుడి వీధి, రాణీగంజ్, సికింద్రాబాద్ - 500 003

మొబైల్: 9866181618, 8019631387, బెంగుళూరు: 080507 42962

# భావము లేక భావసమాధి



భజన సమయంలో దైవిక సూక్ష్మ స్వరూపాలను పొంది భావసమాధిలో ఉన్న భక్తులు

దివ్యశక్తుల ఆవాహన లేదా పూనకాన్ని భావము లేదా భావసమాధి అంటారు. భావము వివిధ వ్యక్తులు పొందినటువంటి, అంతే వివిధ రకాల అనుభవము అయినది. భావమంటే శాంతి మరియు ఉల్లాసము యొక్క అనుభవము. ఇంకోమాటలో చెప్పాలంటే ఆధ్యాత్మిక శక్తి ప్రవాహం దేహములో కంపించుటచే మన ప్రమేయము లేకుండా తనంతటతానుగా జరిగే దేహము యొక్క చలనము. భజన చేయు సమయములో భక్తులు దైవిక సూక్ష్మ స్వరూపాలను పొంది అనుభవించే సమ్మోహనకరమైన సుస్థితియే భావము. శివబాలయోగి మహారాజ్‌వారు భక్తుల భౌతిక శరీరము ద్వారా తమ సూక్ష్మ శరీరము యొక్క ఉనికిని వ్యక్త పరచుటయూ ఇందులో ఒకటే.

స్వామీజీవారి ఆదేశము ప్రకారము ధ్యానాన్ని అభ్యసించి, తద్వారా కలిగే తమ స్వంత అనుభవాలనుండి తెలుసుకోవాలి. స్వామీజీవారు భక్తుడి అవసరము లేదా కోరికకు తగ్గట్లుగా అనుభవాలను వారికి ఇస్తారు. భావాన్ని అనుభవించుట గాని, నృత్యాన్ని గావించుట గాని లేదా శక్తులను పొందుట గాని దానంతట అదే ఆధ్యాత్మిక ఉన్నతిని (వృద్ధిని) సూచించదు. అలాగే....

ఈ భావానుభవ తీవ్రత వ్యక్తిని బట్టి మారుతూ వారివారి ఆధ్యాత్మిక పరిణితి మీద ఆధారపడి ఉంటుంది. భావానుభవాన్ని మూడు స్తరాలుగా విభజించవచ్చు.

1. మొదటి స్తరంలో సాధకుడు శాంతిని, ఆధ్యాత్మికమైన పొంగుతూ అనుభవిస్తాడు. ఇది కోరదగిన అనుభవమై తిరిగి తిరిగి పొందవలెననుకుంటాము. ఇది ఆధ్యాత్మిక పథంలో అతని విశ్వాసాన్ని, ఆసక్తిని ఇనుమడింపచేస్తుంది. అభివృద్ధి చెందిన కొద్దీ అతడు ఆనందాన్ని అనుభవించవచ్చు.

2. ఈ భావం తీవ్రమైన కొద్దీ, సాధకుడు రెండో స్తరాన్నందుకుని దేవీ దేవతలను, ఇష్టదైవాన్ని, మహాసంతులను దర్శించగలుగుతాడు. ఈ దృశ్యాలు, అనుభవాలు, సాధకుని మనస్సును ప్రక్షాళన మొనర్చి పై స్తరానికి దారితీస్తాయి.
3. మూడవ స్తరంలో భావం పూర్తిగా ఫలించినప్పుడు సాధకుడు భావసమాధిని పొందుతాడు.

భావం వృద్ధి అయిన కొద్దీ సాధకుడు తన మనస్సులోని మురికిని వదిలించుకుని, శ్రద్ధ, వైరాగ్యము, శీలశక్తి, మొదలైన మంచి గుణాలను అలవరచుకుంటాడు. అతని వ్యక్తిత్వమంతా మారిపోతుంది. కొందరి విషయంలో శారీరకమైన మార్పులు కూడా వస్తాయి. కాని ఒక విషయం గుర్తుంచుకోవాలి. సాధకుడి యొక్క కనిపించే ఆకారం అంతరంగిక వికాసాన్ని సూచించనవసరం లేదు. పరిణితిలేని సాధకుల విషయంలో చిన్న చిన్న అనుభవాలు కూడా మానసికమైన శారీరకమైన పొంగులను కలిగిస్తాయి. అందుకు విరుద్ధంగా చాలా ఎదిగిన సాధకులు తమకెంతటి ఉన్నత ఆధ్యాత్మికానుభవాలు కలిగినా వాటికి సంబంధించిన బాహ్యసూచనలేవీ వారిలో కనిపించవు.

**భావము : చారిత్రక దృక్పథము:**

భావంలో, భావసమాధిలో కొత్తదనంగానీ, ప్రత్యేకతగానీ ఏమి లేవు. ఇవి ఆధ్యాత్మికత ఎంత పురాతనమైనదో అంతే పురాతనమైనవి. భక్తి మార్గానుయాయులు అందరిలోనూ ఈ లక్షణాలు కనబడతాయి. తక్కిన మార్గాలననుసరించిన వారిలో కూడా ఈ లక్షణాలు కనబడతాయి. కాని కొంచం తక్కువ మోతాదులో ఉంటాయి.

**స్వామీజీ భావలీలలోని ప్రత్యేకత :**

ఈ భావావేశం యుగాలుగా ఆధ్యాత్మిక సాధనలో భాగంగా వస్తూవుంటే, స్వామీజీ భావలీలలోని ప్రత్యేకత ఏమిటి? స్వామీజీ ప్రజలను ఆధ్యాత్మిక పథంలోకి మరల్చటానికి భావలీలను ఉపయోగిస్తారు. శ్రీరామకృష్ణులు, శ్రీ చైతన్య మహాప్రభువు, భావస్థితిని ఇతరులలో కలిగించే వారన్నది మనం చదివినా, ఆ ఆపాదన తమ శిష్యులకే పరిమితమయ్యేది. స్వామీజీ విషయంలో అలాకాక అదొక మహాతరంగంలా పొంగి ఎప్పుడు భజన జరిగినా, ఆ ఆధ్యాత్మిక శక్తి ప్రవాహం చాలా మందిని కాస్తో, కూస్తో, తడిపి వెళుతుంది. చిన్నా పెద్దా అనే భేదం లేకుండా ప్రత్యేకంగా పిల్లలు, ఆవేశంతో ప్రపంచాన్ని మరచి, భక్తి సంగీత లయకు నృత్యం చేస్తూ, పురాణదేవతల, ఋషుల లక్షణాలు తమలో వ్యక్తం చేయటం తరచూ చూస్తూ ఉంటాం. మరో ప్రత్యేకత ఏమిటంటే, ఇలా జరగడానికి స్వామీజీవారి సమక్షం అవసరం లేదు. ఆయన లోపల కూర్చోనో, దర్శన మండపంలో భక్తులకు దర్శనమిస్తూనో వుంటే, కీర్తనలు మరో గదిలో జరుగుతూ పూనకాలు విరివిగా కొనసాగుతూ వుంటాయి. నిజానికి స్వామీజీవారు కొన్ని వేలమైళ్ళ దూరంలో మరో చోట ఉన్నా ఆయన కృపవల్ల భక్తులు ఈ భావావేశాన్ని అనుభవించేవారు. ఇప్పుడు మహా సమాధి తరువాత కూడా భక్తులు భావావేశం మొదటిలాగే అనుభవిస్తున్నారు. ఆయన ఆశీర్వాదాన్ని కోరుతూ ప్రార్థించి, భజన ప్రారంభించాలి. అంతే.

ఇందులో నమ్మశక్యంకాని ఆసక్తికరమైన విషయాలేమిటంటే, స్వామీజీ ఈ శక్తిని ప్రసరింప చేసినప్పుడు భక్తులు సమూహంగా గంటలకొద్దీ, ఏ అయాసమూ, అలసటా లేకుండా, ఒకరినొకరు ఢీకొనకుండా, తక్కిన భక్తులకు ఏ ఇబ్బందీ కలగకుండా నాట్యం చేస్తారు. హనుమద్భావం కలిగినవారు చెట్లెక్కుతూ పెళుసు కొమ్మలమీద నాట్యం చేస్తూ, వాటినుండి వ్రేలాడుతూ కొంచం గీటుకూడా లేకుండా దూకుతూ వుండటం చూస్తాం. భజన ముగిసిన తర్వాత భృకుటిలో విభూతి బొట్టు పెట్టిన వెంటనే వారు మామూలు చైతన్య స్థితికి వస్తారు.

నటరాజు భావం కలిగిన వారు లయబద్ధంగా నృత్యం చేస్తూ, రాముడి భావం కలిగినవారు విల్లు బాణం ఎక్కుపెడుతూ ఉన్న భంగిమని ప్రదర్శిస్తూ, కృష్ణుడి భావం కలిగినవారు మురళిని వాయిస్తున్న భంగిమలో చూడగలము.

**భావం వల్ల లాభాలు :**

భావం ద్వారా స్వామీజీవారి ఆశీర్వాదం పొందినవారికి ఈ క్రింది లాభాలు కలుగుతాయి.

1. మానసిక, శారీరక కారణాలవల్ల కలిగిన రుగ్మతలు తొలగి, దీర్ఘ వ్యాధులతో సహా అన్ని వ్యాధులూ కుదురుతాయి.
2. దివ్య చైతన్యం వారిలో కలుగుతుంది.
3. దేవుడిలో చెదరని శ్రద్ధా విశ్వాసాలు కలుగుతాయి.
4. అహంకారం అదుపులోవుండి దానిస్థానే దైవసంకల్పానికి ఆత్మ సమర్పణ ఏర్పడుతుంది. ✱



# సేవకు ప్రతిరూపం
# శ్రీ స్వామివారి మాతృదేవత
# శ్రీమతి అల్లక పార్వతమ్మగారు

**స్వామీజీ తల్లిగా అత్యంత గౌరవమర్యాదలు పొందినప్పటికీ అవన్నీ తన మాతృ హృదయాన్ని ఏమాత్రమూ ప్రభావితం చేయలేక పోయాయి. పార్వతమ్మ కేవలం తన కొడుకుకే తల్లిగా కాకుండా ఆశ్రమానికి వచ్చే భక్తులందరికీ తల్లిలాగ తన ప్రేమను చూపేవారు. తను నడిచి వచ్చిన పేదరికంలోని రోజులను ఎప్పుడూ మరువలేదు. అందుకే తన హృదయంలో ఎప్పుడూ పేదల మరియు దీనులపట్ల ప్రత్యేక స్థానం ఉండేది. తన దయార్ద్ర హృదయంతో పేదలకు ఆహారంగాని, డబ్బులుగాని, లేదా బట్టలుగాని ఏవి అవసరమో అన్నిటినీ ఇచ్చివేసేవారు.**

ఒక ఆత్మ యోగిగా జన్మించడానికి అతనికి జన్మనిచ్చే తల్లిదండ్రులు కూడా మహాత్ములై ఉండాలి. తమ ప్రతి జన్మలోనూ తమ తల్లిదండ్రులు పార్వతీ పరమేశ్వరుల అంశలై ఉంటారని స్వామీజీ భక్తులకి సెలవిచ్చేవారు. స్వామీజీవారు ఏకాంత సమయంలో పలువురు భక్తులకు తమ తల్లి పార్వతీదేవి అవతారమని స్పష్టం చేశారు.

తమ తల్లిగారి ప్రేమ గురించిన ఈ క్రింది కథను స్వామీజీవారు చెప్పేవారు. డెహ్రాడూనికి చెందిన శ్రీశివరుద్ర బాలయోగి గారు వివరించినట్లుగా;

స్వామీజీవారు తన చిన్నతనంలో అంటే దాదాపు ఐదు సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు ఆకలివేసినప్పుడల్లా తన తల్లిని అన్నం పెట్టమని అడిగేవారు. తల్లి పార్వతమ్మకూడా అడిగిన వెంటనే బాలుడికి ప్రేమతో అన్నం పెట్టేవారు. కొన్ని సందర్భాలలో తన తల్లి విచారంతో ఉండడాన్ని సత్యరాజు గమనించాడు. కాని ఎందుకో తెలియక ఆశ్చర్యపోయేవాడు. తన తల్లి సరిగ్గా భోజనం చేసింది తాను ఎప్పుడూ చూడలేదనే ఆలోచన మదిలో రాగానే కారణం తెలుసుకోవాలని ఒక ఉపాయం పన్నాడు.

తల్లి దగ్గరకు వెళ్ళి అన్నం పెట్టమని అడిగాడు. ఎప్పటిలానే పార్వతమ్మ కొంచం ఆహారం వడ్డించింది. ఈసారి సత్యరాజు తనతోపాటు నువ్వు కూడా తినాలని అడిగాడు. కాని ఇప్పుడు తనకు పని ఉండటంవల్ల కాసేపు ఆగి తరువాత తింటానని చెప్పింది. అందుకు బాలుడు ఒప్పుకోక, ఇప్పుడే తినమని మారాం చేశాడు. చివరికి అందులో కొంచం ఆహారాన్ని తీసి పక్కన పెట్టి ఇదిగో దీనిని నేను కాసేపటి తరువాత తింటానులే అని చెప్పింది.

సత్యరాజు భోజనం ముగించుకుని బయటకు వెళ్ళినట్టుగా నటించి, తలుపు చాటున దాగి, తన తల్లి భోజనం చేసిందీ లేనిదీ తెలుసుకోవడానికి దాదాపు రెండు గంటలు ఓపిగ్గా నిరీక్షించాడు. కాని పిల్లవాడు అనుకున్నదే నిజమయ్యింది. పార్వతమ్మ భోజనం చేయనేలేదు.

కొంత సమయం తరువాత బయటనుండి వస్తున్నట్టుగా నటించి అమ్మని పిలిచి ఎప్పటిలానే ఆకలిగా ఉన్నదని అన్నం పెట్టమని అడిగాడు. పార్వతమ్మ తనకోసం పక్కన పెట్టియున్న అదే ఆహారాన్ని పిల్లవాడికి వడ్డించింది.

సత్యరాజు "అమ్మా ఇందాక నీకోసం పక్కన తీసిపెట్టిన అన్నం తిన్నావా?" అని అడిగాడు. పార్వతమ్మ "అవును, తిన్నాను. నువ్వు ఆకలిగా ఉన్నావు ప్రశ్నలు అడగడమాపి ముందు తిను" అని చెప్పింది. అందుకు సత్యరాజు "లేదు. నువ్వు అబద్ధం చెబుతున్నావు. నువ్వు కొంచం కూడా తినలేదు. రెండు గంటల నుండి నేను తలుపు చాటున దాక్కుని చూస్తూనే



జన్మనిచ్చిన తల్లి భక్తురాలిగా యోగీశ్వరుడైన కుమారుడికి ప్రణమిల్లుతున్నది.

ఉన్నాను" అన్నాడు. అందుకు ఆమె బాధతో కళ్ళనీళ్ళు పెట్టుకుని తలతిప్పేసుకుంది.

ఏమి జరిగిందో తెలియక కంగారుతో మరియు అమ్మని నొప్పించానేమోనన్న బాధతో సత్యరాజు తాత గోలిసత్యం దగ్గరకు వెళ్ళి ఇలా దబాయించాడు (అది అతని శైలి), "ఎందుకు అమ్మ సరిగ్గా భోజనం చేయట్లేదు? తన అన్నం కూడా ఎందుకు పిల్లలకే పెడుతుంది?."

అందుకు తాతగారు, "చూడు, మనం చాలా పేదవాళ్ళం, కాని దీని గురించి ఇప్పుడు నువ్వు ఆలోచించనక్కరలేదు. చదువు మీద ధ్యాసపెట్టు. పిల్లలు ఆకలితో ఉంటే తల్లి హృదయం తట్టుకోదు. తను చాలా కొంచమే తింటుంది. తను సరైన భోజనం చేసి చాలా రోజులయ్యింది" అన్నారు. ఆ ఐదు సంవత్సరాల పసివాడు అసలు పేదరికమంటే ఏమిటి? ఎందుకు మనం పేదవాళ్ళుగా ఉన్నాము అని అడిగాడు. తాతగారు, "నీకు రెండు సంవత్సరాల వయస్సులో నీ తండ్రి చనిపోయాడు. అందుచేత నీ తల్లి కష్టపడి పనిచేసి మిమ్మల్లను పోషిస్తోంది" అన్నారు.

ఈ సంఘటన సత్యరాజు మనస్సులో తన కుటుంబం కోసం డబ్బులు సంపాదించాలన్న ప్రేరణ కలిగించింది. తన తల్లి ఎటువంటి కష్టమూ పడరాదని తన చిన్ని చిన్ని చేతులతో కష్టపడి డబ్బులు సంపాదించడం ప్రారంభించాడు. తన తల్లికి బంగారు గాజులు లేవని బాధపడి తనకు ఆరేళ్ళ వయసున్నప్పటి నుండి తనకు వచ్చిన ఆదాయంలో ఒకటి, రెండు పైసలను డబ్బాలో వేసి అతనికి 12 సం॥లు వయస్సు వచ్చేటప్పటికి అరవై రూపాయలు పొదుపు చేశాడు. ఆ డబ్బుతో బంగారు గాజులు చేయించాడు.

శివబాలయోగి పన్నెండు సంవత్సరముల తపస్సు సమయంలో తన తల్లి పార్వతమ్మ ఎంతో భక్తి శ్రద్ధలతో అతడి సేవ చేసింది. పార్వతమ్మకి త్రిమూర్తుల దర్శనం కలిగిన తరువాత అతడిని తన కొడుకులా కాక, మహాత్ముడిలా ఎంచి, పూజ్య భావనతో ఒక ఋషికి ఇచ్చే గౌరవం మరియు భక్తి ప్రపత్తులను చూపేది. అందుకే పార్వతమ్మను భక్తులు మరియు శిష్యులందరిలోనూ ప్రథమ శిష్యురాలిగా చెబుతారు.

స్వామిజీ తపస్సు చేస్తున్న ప్రారంభంలో స్వామిజీని మరియు తల్లి పార్వతమ్మను మోసగాళ్ళుగా పరిగణించి ఎన్నో విధాలుగా నిందించేవారు. కాని తపస్సు సమాప్తి తరువాత వారిలో చాలా మంది స్వామీజీకి అత్యంత సన్నిహిత భక్తులుగా మారిపోయారు. కాని పార్వతమ్మ అనుభవించిన యాతనలు,



అవమానాలు అతి తీవ్రమైనవి. తన కొడుకులాగ ఆమెది కూడా ఎలాంటి దాపరికం లేకుండా ముక్కుసూటిగా మాట్లాడే తత్వం. ఒకసారి ఇంతక్రితం అవమానించి అపహాస్యం చేసిన ఒకతను దర్శనం కోసం ఆశ్రమానికి వచ్చినప్పుడు పార్వతమ్మకు గతంలో అనుభవించిన విషయాలు, జ్ఞాపకాలు గుర్తుకువచ్చి ఎంతో ఆవేదన చెంది, "ఈ మనిషి అప్పుడు అంత హేళన చేసి, నానా ఇబ్బందులకు గురి చేసి, ఇప్పుడు ఒక భక్తుడుగా ఆశ్రమానికి వచ్చాడు" అని గట్టిగా అందరిముందూ చెప్పింది. అందుకు స్వామీజీ ఈ 12 సం॥ల కాలంలో ఆమె తనకు ఎంతో సేవ చేసిందని, ఎన్నో నిందలను మోసిందని, చాలా కష్టములను భరించిందని చెప్పారు. దానికి అక్కడున్న భక్తులు, గ్రామస్థులు కూడా అంగీకరించారు.

స్వామీజీ తన ఆశ్రమ కార్యకలాపాలన్నీ ఆదివారప్పేట నుండి బెంగళూరుకు తరలించాక పార్వతమ్మకూడా తన వెంటే వెళ్ళింది. ఆశ్రమానికి కొద్ది దూరంలో ఒక ఇంటిలో నివసిస్తూ, స్వామీజీని చూసుకుంటూ, ఆశ్రమాన్ని నిభాయించింది. స్వామీజీ తల్లిగా అత్యంత గౌరవమర్యాదలు పొందినప్పటికీ అవన్నీ తన మాతృ హృదయాన్ని ఏమాత్రమూ ప్రభావితం చేయలేక పోయాయి. పార్వతమ్మ కేవలం తన కొడుకుకే తల్లిగా కాకుండా ఆశ్రమానికి వచ్చే భక్తులందరికీ తల్లిలాగ తన ప్రేమను చూపేవారు. తను నడిచి వచ్చిన పేదరికంలోని రోజులను ఎప్పుడూ మరువలేదు. అందుకే తన హృదయంలో ఎప్పుడూ పేదల మరియు దీనులపట్ల ప్రత్యేక స్థానం ఉండేది. తన దయార్ద్ర హృదయంతో పేదలకు ఆహారంగాని, డబ్బులుగాని, లేదా బట్టలుగాని ఏవి అవసరమో అన్నిటినీ ఇచ్చివేసేవారు. ఆశ్రమం మొదటి రోజులలో పేదలకు అన్నం పెట్టలేని రోజులు ఉండేవి. కాని ఆవిడ ఎవరినీ భోజనం చేయకుండా పంపుటకు ఇష్టపడేవారు కాదు. రాత్రి పన్నెండు గంటల సమయంలో కూడా ఎవరు వచ్చినప్పటికీ ఆమె స్వయంగా వండి వడ్డన చేసేవారు. ఎటువంటి వ్యత్యాసం లేకుండా అందరినీ సమానంగా చూసేవారు. శివబాలయోగి తన ఆధ్యాత్మిక ఔన్నత్యంనుండి ఎంతో మందిని ఆకర్షిస్తే, పార్వతమ్మ గారు తమ మాతృహృదయం మరియు సేవతో అంతే సమానంగా భక్తుల ప్రేమను చూరగొన్నారు.

ప్రతియొక్క భక్తునికి కూడా పార్వతమ్మగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకునేవారు. మరియు ఏదైనా సమస్యలుగాని కష్టాలుగాని ఉంటే తెలుసుకొని స్వామీజీకి స్వయంగా వినిపించి వారి బాధలను నివారించమని గట్టిగా విన్నవించేవారు.

కర్ణాటకలో ఒక సమయంలో బియ్యానికి తీవ్రమైన కరువు వచ్చింది. బియ్యం ఎక్కువగా వ్యర్థమయ్యేటువంటి పెద్ద పెద్ద వేడుకలను జరుపరాదని ప్రభుత్వం ఆదేశించింది. ఆశ్రమంలో అన్నదానానికి బియ్యం దొరకడం చాలా కష్టమయ్యింది. అసలు బియ్యం దొరకని పరిస్థితి. స్వామీజీ అప్పుడు తన దగ్గరకు వచ్చిన ప్రభుత్వాధికారులకు చెప్పి ఎలాగో కొన్ని బియ్యం బస్తాలను తీసుకున్నారు. అవి కొన్ని నెలలవరకు వస్తాయని అంచనా వేసారు. ఒక వారం తరువాత పార్వతమ్మ బియ్యం మొత్తం ఖర్చు అయ్యిందని తెలిపారు. తను మొత్తం బియ్యాన్ని వచ్చినవాళ్ళందరికీ వండి అన్నదానం చేశారు. పార్వతమ్మగారు బియ్యం తెప్పించడం స్వామీజీకి కష్టం అనే మాటను ఒప్పుకునేవారు కాదు. తనకు కావలసినదల్లా అందరికీ అన్నదానం చేయడమే. స్వామీజీ మళ్ళీ ప్రభుత్వాధికారులను ఇంకా ఎక్కువ బియ్యం కోసం అడగాల్సివచ్చింది.

భక్తుల సేవయే పరమావధిగా, నిస్వార్థంతో ఆశ్రమ ఉద్ధరణకు తమ జీవితాన్ని సమూలంగా త్యాగం చేసిన పార్వతమ్మగారిని స్మరించుకుంటూ, అటువంటి సేవ తత్పరతను కొంతైనా మన జీవితంలో అలవరచుకొని అమ్మబాటలో నడిచి స్వామీజీవారి 'మిషన్'లో పాలు పంచుకుందాం, ధన్యులమవుదాం. *

# అన్నపూర్ణమ్మగారి అనుభవాలు

మా అమ్మ భీమేశ్వరమ్మ ఆదివారప్పేటకు (ఆదివారప్పేట స్వామీజీవారి జన్మస్థలం. అక్కడే ఆయన 12 సంవత్సరాల ఘోర తపస్సు ఆచరించినది) 20 కి.మీ దూరంలో ఉన్న చిన్న పట్టణమైన మండపేటలో ఉండేవారు. తన జీవితాంతం స్థూలకాయంతో మరియు దానివల్ల కలిగే అనేక సమస్యలనుండి (రోగాలనుండి) బాధపడుతుండేవారు. ఒకసారి తన స్థూలకాయంవల్ల చాలా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కలిగాయి. ఆవిడను కాకినాడ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ ముఖ్య డాక్టరుగారు పరిశీలించి, వైద్యం చేసి, మూడు వారాలకంటే ఎక్కువ రోజులు బ్రతకదని చెప్పి ఇంటికి తిరిగి పంపించారు.

మా నాన్నగారి పేరు నమశ్శివాయ. దేవుడిని నమ్మేవారు కాదు. నాస్తికులు. అందుకని అమ్మ ఆరోగ్యం గురించి మొక్కుకోవటానికి అమ్మని ఏ దేవుడి దగ్గరకూ, ఆలయాలకూ తీసుకు వెళ్ళేవారు కాదు. కాని మా అమ్మమ్మ మాత్రం అప్పటికే స్వామీజీ తపస్సు పూర్తికాక ముందునుంచే, ఆదివారప్పేటకు తరచూ స్వామీజీ దర్శన నిమిత్తం వెళ్ళివచ్చేవారు. ఒకసారి మా అమ్మమ్మ నాన్నగారితో "శివబాలయోగి స్వామి దగ్గరకి ఒకసారి తీసుకువెళ్ళి ఎందుకు చూపించకూడదు? అతను 12 సంవత్సరాలు తపస్సు పూర్తిచేసి, చాలా తపశ్శక్తిని గడించాడు. అతనేమైనా చేయగలడు" అన్నారు. ఆవిడ ప్రోత్సాహంవల్ల మరియు నాన్నగారికి అమ్మ మీద ఉన్న ప్రేమ వల్ల ఎలాగైనా బ్రతికించుకోవాలనే తాపత్రయంతో అమ్మని ఆదివారప్పేటకు తీసుకువెళ్ళారు.

అమ్మ చాలా నీరసంగా, నిశ్శక్తిగా మరియు తీవ్రమైన అస్వస్థతతో ఉన్నది. స్వామీజీ ఆవిడను చూసి "అమ్మా స్వామీజీ విభూతిని ఇస్తారు. అంతా స్వామీజీ చూసుకుంటారు. ఆపరేషన్ బాగా జరిగేలాగ చేస్తారు. మీరు వెళ్ళి ఆపరేషన్ చేయించుకోండి" అన్నారు. అమ్మ చాలా భక్తిగలది మరియు దేవుడి మీద గొప్ప విశ్వాసంగలది. "లేదండీ ఈ డాక్టర్ల చేత నేను ఆపరేషన్ చేయించుకోను. ఈ ఆపరేషన్ చేయించుకోవడం నాకు సుతరామూ ఇష్టం లేదు. మీరు గొప్పవారు. చాలా తపశ్శక్తిగలవారు. మీరేమైనా చేయగలిగితే చేయండి. కాని డాక్టర్ల దగ్గరకు మాత్రం వెళ్ళను" అన్నారు. స్వామీజీ చిరునవ్వు నవ్వి కొంచం విభూతిని మంత్రించి ఇచ్చి, వాడమని చెప్పారు.

**ఆరోజునుండి అమ్మకి తిరిగి తిరిగి భావసమాధి కలిగేది. నిదానంగా ఏ ఆపరేషనూ లేకుండానే స్వామీజీ ప్రసాదించిన భావసమాధివల్ల తన రోగం పూర్తిగా నయమయ్యింది. మూడు వారాలలో చనిపోతుందన్న మా అమ్మ స్వామీజీ ఆశీర్వాదం వల్ల మరో 25 సంవత్సరాలపాటు బ్రతికింది.**

తొలిచూపులోనే మా నాన్నగారు పూర్తిగా స్వామీజీవైపు ఆకర్షితులైయ్యారు. ఒక రోజు మా నాన్నగారు ఇంట్లో భజనలు ఏర్పాటు చేద్దామని అనుకున్నారు. అమ్మ చాలా ఖర్చు అవుతుందనీ మరియు పని కూడా ఎక్కువగా ఉంటుందనీ, అంత మందికి వంట చేయటం కష్టం అవుతుందేమో అని భయపడ్డారు. వ్యాపారం బాగుండటం వల్ల నాన్నగారు ఖర్చులకు భయపడక, అన్ని ఏర్పాట్లూ చేయించి, ఆదివారప్పేట నుండి భక్తులను బస్సులలో తీసుకువచ్చారు. ఆ రోజు వందలాది మంది భక్తులు భజన సమావేశానికి హాజరయ్యారు.

భజనలకు ఏర్పాట్లు జరుగుతుండటం, మరియు అన్నదానానికి వంటలు వండుతుండటం వంటి ఏర్పాట్లను చూసిన ఇరుగుపొరుగువారు, "ఇంట్లో కొన్ని రోజుల్లో చనిపోయే మనిషిని ఉంచుకుని వీరు పండుగ చేసుకుంటున్నారేమిటి" అని మాట్లాడుకోసాగారు.

ఆ రాత్రి భజనలు జరుగుతున్నప్పుడు అమ్మకి భావసమాధి (పూనకం) కలిగింది. తను చాలా విపరీతంగా బరువుండటంవల్ల అసలు పక్కనుండి లేవడానికి కూడా తనకి చేతనయ్యేదికాదు. అంతేగాక తీవ్ర రోగగ్రస్థురాలైన తను ఇక కొన్ని రోజులు మాత్రమే బ్రతుకుతుందని డాక్టర్లు ఇదివరకే చెప్పడం జరిగింది. కాని, భావసమాధి కలుగగానే, ఎవరి సాయం లేకుండా పైకి లేచి, ఊగుతూ లయబద్ధంగా భజనలకి నాట్యం చేయనారంభించింది. ఆ రోజు ఇరవైనాలుగ్గంటలూ

తను భావసమాధిలోనే ఉండిపోయింది. ఇది చూసిన చుట్టుపక్కలవారికి అసలేం జరుగుతుందో అర్థం కాలేదు.

ఆరోజునుండి అమ్మకి తిరిగి తిరిగి భావసమాధి కలిగేది. నిదానంగా ఏ ఆవేశమూ లేకుండానే స్వామీజీ ప్రసాదించిన భావసమాధివల్ల తన రోగం పూర్తిగా నయమయ్యింది. మూడు వారాలలో చనిపోతుందన్న మా అమ్మ స్వామీజీ ఆశీర్వాదం వల్ల మరో 25 సంవత్సరాలపాటు బ్రతికింది.

రాను రాను మా నాన్నగారు పూర్తిగా శివబాలయోగి స్వామీజివారికి గొప్ప భక్తులైయారు. స్వామీజీ సేవ చేసుకుంటూ సుదూర ప్రాంతాలనుండి అదివారప్పేటకు వచ్చే భక్తులను తమ ఇంటికి తీసుకువచ్చి సేవించేవారు. స్వామీజీ కూడా అలా దూర ప్రాంతాలనుండి వచ్చిన భక్తులకు, మొదట మండపేటలోని సమశ్శివాయ ఇంటికి వెళ్ళమని చెప్పేవారు. నాన్నగారు ఎప్పుడూ భక్తులను చాలా ప్రేమతో చూసుకునేవారు. అడిగిందే తడవుగా తమ ఇంటికి తీసుకొచ్చేవారు. ప్రత్యేకంగా మండపేటలో మాత్రమే దొరికే తీపి మిఠాయిలను తినిపిస్తూ చాలా ఆనందం పొందేవారు.

భక్తులు కూడా చాలా ఆనందంగా ఆస్వాదించేవారు. అమ్మ ఎప్పుడూ తన వంటగదిలో భక్తుల కోసమని కావలసినన్ని మిఠాయిలను తయారుగా ఉంచేది. భక్తులు సమశ్శివాయ ఇంటి ఆతిథ్యాన్ని కొనియాడేవారు. భక్తులకు మంచి ఆతిథ్యం ఇచ్చి తిరిగి అదివారప్పేట వెళ్ళేందుకుగాను కారును ఏర్పాటు చేసేవారు.

ఆ రోజు భజనలు జరిగిన రాత్రి మొదటిసారి అమ్మకి భావసమాధి కలిగినప్పుడు, అమ్మకి చికిత్స చేసిన కాకినాడ డాక్టరు మా ఇంటిదగ్గర రావటం తటస్థించింది. భావసమాధిలో భజనలకు లయబద్ధంగా నృత్యం చేస్తున్న అమ్మను చూసి డాక్టరుగారు ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. మా కుటుంబసభ్యులను "ఏం వైద్యం చేయించారా"ని అడిగారు. "అమెరికాకేమైనా తీసుకువెళ్ళి వైద్యం చేయించారా? ఏ డాక్టరు నయం చేసాడు? ఇది ఎలా సాధ్యం?" అని ఆశ్చర్యంతో ప్రశ్నల వర్షం కురిపించారు. మేము శివబాలయోగి స్వామీజి దగ్గరకు తీసుకెళ్ళామని చెప్పాము. ఆయన ఇచ్చిన విభూతివల్ల అమ్మకు నయం అయ్యిందని తెలిపాము.

డాక్టరుగారు చాలా ఆసక్తిగా విన్నారు. అలాంటి పరిస్థితులలో అమ్మ లేచి నృత్యం చేస్తుండటం కళ్ళారా చూస్తున్నా, తన కళ్ళను తానే నమ్మలేకపోయారు. అతను పెళ్ళిచేసుకుని చాలా సంవత్సరాలైనా కూడా పిల్లలులేని బాధతో కుమిలిపోయేవాడు. ఇది చూసాక తను కూడా శివబాలయోగి స్వామీజీ దగ్గరకు వెళ్ళి ఆశీర్వాదం పొందడానికి నిశ్చయించుకున్నాడు. తన శ్రీమతిని వెంటబెట్టుకొని అదివారప్పేటకు వెళ్ళి స్వామీజీని దర్శించుకున్నారు. స్వామీజీ వారికి విభూతిని ఇచ్చారు. కొద్ది కాలానికే వారికి మగసంతానం కలిగింది. ఆ పిల్లవాడికి స్వామీజీవారే పేరుపెట్టడం కూడా జరిగింది. కొన్ని రోజుల తర్వాత ఒకసారి డాక్టరుగారు మరియు వారి శ్రీమతి ఇద్దరూ కలిసి మా ఇంటికి వచ్చినప్పుడు డాక్టరుగారు ఇలా అన్నారు. "ఆ రోజు మొదటిసారి మీ అమ్మకి భావసమాధి కలిగినప్పుడు, అనుకోకుండా నేను మీ ఇంటికి వచ్చి చూసినప్పుడు, మీరు శివబాలయోగి స్వామీజి గురించి చెప్పారు కదా, కాని నాకు అంతకుముందే స్వామీజీ గురించి తెలుసు. ఒకసారి నేను అదివారప్పేటకు వెళ్ళి దర్శించుకున్నాను కూడా. కాని అప్పుడు నాకు ఆయన రోగాలను నయం చేస్తారని, మహిమలను చూపుతారని ఎవరూ చెప్పలేదు. మిమ్మల్ని చూసిన తర్వాతే నాకు ఈ విషయం తెలిసింది" అన్నారు.

మా అమ్మలానే నేను కూడా స్థూలకాయంవల్ల కలిగే అనేక సమస్యలతో బాధపడ్డాను. నాకు 12 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడే పెళ్ళిచేసి అత్తవారింటికి పంపించారు. అక్కడ చాలా సమస్యలను ఎదుర్కొని, తాళలేక భర్తను వదిలి పుట్టింటికి వచ్చేశాను. అంతకుముందే మా నాన్నగారు తమ మొత్తం ఆస్తిని మా ఇద్దరు అన్నయ్యలకు పంచిపెట్టారు. వాళ్ళిద్దరూ విడిపోయి వాళ్ళ భాగానికి వచ్చిన ఆస్తిలో ఇళ్ళు కట్టించుకుని వేరు కాపురాలు పెట్టారు. మా అమ్మా నాన్నలకు మిగిలిన ఏకైక ఆస్తి, అనాదినుండి నివసిస్తూ వస్తున్న మా మండపేట ఇల్లే. మా అన్నయ్యలు తల్లితండ్రుల ఆస్తిని పంచుకున్నారుగాని బాధ్యతను మాత్రం గాలికొదిలేశారు. మా బాగోగులను ఏనాడూ పట్టించుకోలేదు. నాకు కూడా నా తల్లితండ్రుల ఇల్లు తప్ప వేరే దిక్కులేదు.

స్వామీజీ మా ఇంటి సమస్యలనుండి, వ్యాపార సమస్యలవరకు అన్నింటినీ విని కలగజేసుకుని నాన్నగారికి సలహాలు ఇస్తుండేవారు. ఒక సమయంలో మా నాన్నగారిని స్వామీజీ రెండు మూడు నెలలు ఆశ్రమంలోనే ఉంచుకుని

సాంత్వన పలికారు. మా ఇంటిని అమ్మేయమని మా నాన్నకు నెమ్మదిగా నచ్చజెప్పారు. మాకు అప్పుడు బ్రతకడానికి మరియు ఇతర ఖర్చులకు డబ్బు చాలా అవసరం ఉండేది. కాని ఉన్న ఒక ఇంటినీ అమ్మేస్తే తరువాత మాకు తలదాచుకోవడానికి వేరే ఆశ్రయం ఏదీ లేదు కదా అని నాన్నగారు దిగులు చెందారు. స్వామీజీ అందుకు అభయమిచ్చి, రెండు మూడు వీధుల అవతల పాడుబడ్డ ఇల్లు ఒకటి ఉందనీ, పాడుబడ్డది కాబట్టి తక్కువ ధరకే దొరకుతుందనీ నిశ్చయంగా చెప్పారు. కాని ఈ విషయం నీ భార్యాబిడ్డలకి ఇప్పుడే చెప్పవద్దని, చెబితే వారు ఆ శిథిలమైన ఇంటిని కొనడానికి అంగీకరించరని హెచ్చరించారు.

మాకు తెలియకుండా నాన్నగారు కొనవలసి ఉంది. ఇంకో సంవత్సరంలో నువ్వు చనిపోబో తున్నావని కూడా స్వామీజీ నాన్నగారికి చెప్పారు. చావు చాలా దగ్గరగా ఉండటంవల్ల నాన్నగారు అన్ని ఏర్పాట్లనూ చాలా తొందరగా చేయాల్సి వచ్చింది.

స్వామీజీ చెప్పినది కాకుండా మంచి ఇల్లు ఏదైనా అతి తక్కువ ధరకు దొరకుతుందా అని నాన్నగారు మండపేట అంతటా వెతికారు. కాని ఒక్కటీ దొరకలేదు. చివరికి స్వామీజీ చెప్పిన ఆ పాడుబడిన ఇల్లు మాత్రమే దొరికింది. స్వామీజీ వారు చెప్పిన ప్రకారం నాన్నగారు ఆ ఇంటిని మాకు చెప్పకుండా కొన్నారు.

ఈ విషయం మాకు తెలిసినప్పుడు నాన్నగారిమీద మాకు చాలా కోపం కలిగింది. మాకు ఇల్లు వదలడం ఎంతమాత్రమూ ఇష్టం లేదు. కాని స్వామీజీవారే పాత ఇంటిని అమ్మివేసి కొత్తఇల్లు కొనమని సూచించారని, స్వామీజీ సలహావల్లనే కొనడం జరిగిందని నాన్నగారు చెప్పారు. మాకు చాలా ఆలస్యంగా చెప్పడం వలన మరియు అప్పటికే అన్ని ఏర్పాట్లు జరిగిపోయినందువలన మాకు ఆక్షేపణ తెలుపడానికి కూడా అవకాశం దొరకలేదు. అందుకు నేను బాధపడి "అవును, పెద్ద బంగళాలో ఉండే స్వామీజీకేమి తెలుసు, పాడుబడ్డ ఇంటిలో నివసించటం ఎంత దుర్భరమని. ఇలాంటి సలహాలు ఇవ్వడం ఆయనకి చాలా సులువు. నాకేం అవసరం లేదు ఇలాంటి సలహాలు" అన్నాను. మేము బలవంతంగా కొత్త ఇంట్లోకి తోసివేయబడుతున్నామని నాకు అనిపించింది. కాని తర్వాత కొంత కాలానికి, ఈ కొత్త ఇల్లు చాలా ఆశీర్వదించబడ్డదనీ, ముందు ముందు నాకు నా తల్లితండ్రులు పోయాక నేనొక్కదాన్నే క్షేమంగా నివసించడానికి అనుకూలమైనదని తెలుసుకున్నాను.

**కొన్ని సార్లు నేను తీవ్ర రోగగ్రస్తురాలై లేవలేని స్థితిలో పడుకునే ఉండేదాన్ని. నాకు సహాయం చేయడానికి గానీ, వంట చేయడానికి గానీ ఎవరూ ఉండేవారు కారు. స్వామీజీవారే వచ్చి నాకు భోజనం తినిపించేవారు! ఆయన సూక్ష్మశరీరంలో ప్రత్యక్షమై తన స్వహస్తాలతో భోజనం తినిపించేవారు. నా కళ్ళారా చాలా స్పష్టంగా ఆయన చేతులనూ, కాళ్ళనూ, శరీరాన్ని చూశాను. తలచుకుంటేనే హృదయం ద్రవించిపోతుంది. ఎదలో పెల్లుబుకుతున్న వేయి భావోద్వేగాలు కన్నీళ్లుగా బయటకొస్తున్నాయి. అనిర్వచనీయమైన అనుభూతి ఇది. ఏ జన్మలో చేసిన పుణ్యమో ఏమో ఇంతటి మహాత్ముని కరుణకు నోచుకున్నాను.**

మూడు రోజుల తర్వాత బెంగుళూరులో స్వామీజీని ఆశ్రమంలో దర్శించుకునేటప్పుడు నాన్నగారు పాత ఇంటిని అమ్మేసిన సంగతిని బయటపెట్టారు. అప్పుడు నేను పక్కనే ఉన్నాను. నేను దర్శనం చేసుకునే సమయంలో స్వామీజీ అక్కడున్న వారితో ఇలా అన్నారు. "మీకు తెలుసా ఈ అమ్మాయి నా గురించి ఏమి అనుకుంటుందని? నేను ఈ పెద్ద బంగళాలో ఉంటున్నాను కాబట్టి నాకు చిన్న గుడిసెలో ఉన్నవాళ్ళ జీవితం గురించి తెలియదట. దయచేసి ఈ అమ్మాయికి చెప్పండి నేను మా చిన్న పాత ఇంట్లో ఉన్నప్పుడే సమయానికి సరిగ్గా భోజనం చేసేవాడిని. ఈ పెద్ద బంగళాలో నివసిస్తున్నా ఏనాడూ సమయానికి సరిగ్గా భోజనం చేసింది లేదని". ఈ మాట వినగానే నేను అదిరిపడ్డాను. అప్పుడు నాకు తెలిసింది ఆయన సర్వాంతర్యామి అని.

పాడుబడిన ఈ కొత్త ఇంటికి మారిన తర్వాత, మా నాన్నగారు బ్రతికి ఉన్న రోజుల్లోనే మేము చాలా సార్లు ఈ

ఇంటిని అమ్మివేయడానికి ప్రయత్నించాము. నేను ధ్యానంలో ఉన్నప్పుడు ఈ ఇల్లు "ఓంకార మందిరం" అనే సందేశం వచ్చేది. స్వామీజీ కూడా నాతో చాలా సార్లు మీ ఇల్లు ఓంకార మందిరం అని చెప్పేవారు. నాన్నగారు పోయాక నాకూ అమ్మకూ ఏ ఆదాయమూ లేక విలవిల్లాడి పోయేవారము. కనీసం తిండికీ బట్టలకైనా ఈ ఇంటిని అమ్మేయాల్సిన దుస్థితి. నేను చాలా సార్లు ఇల్లు అమ్మడానికి ప్రయత్నించాను. అమ్మ పోయాక కూడా కొన్ని సంవత్సరాలపాటు ప్రయత్నించాను. కాని అమ్మలేకపోయాను. కొన్నిసార్లు కొనుగోలుదారులనుండి అడ్వాన్స్ తీసుకున్నా, వెంటనే నేను జబ్బు పడడమూ, లేవలేకపోవడమూ జరిగేవి. దాంతో విసిగిపోయిన కొనుగోలుదారులు ఇచ్చిన అడ్వాన్స్ వెనక్కి తీసుకొని వెళ్ళిపోయేవారు. ఈ అటంకాలన్నీ నేను ఇల్లు అమ్మకూడదని స్వామీజీవారు ఇచ్చే సందేశమని గ్రహించాను.

అమ్మ 1988లో నన్ను ఒంటరిని చేసి లోకం వదిలి వెళ్ళిపోయింది. నాకున్న ఒక్క అసరా కూడా కనుమరుగయ్యింది. ఆవిడ లేని శున్య ప్రపంచాన్ని భరించలేకపోయాను. చిన్నతనంనుండి నాకెదురైన చిన్న చిన్న బాధలన్నిటికీ నాకు ఉపశమనం కలిగిస్తూ వచ్చిన అమ్మ తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయింది. మా అన్నయ్యలు ఏనాడు నన్ను పట్టించుకున్న పాపానికి పోలేదు. నా జీవిత అవసరాలకోసం ఉన్న ఇంటిలో సగభాగం అద్దెకు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. వచ్చే కిరాయి నేను బ్రతకడానికి ఏమాత్రమూ సరిపోయేది కాదు. అయినా ఊహించని విధంగా నాకు సహాయం లభించేది. ఎవరో ఒకరు వచ్చి బియ్యం ఇచ్చేవారు, ఇంకొకరు బట్టలూ ఇచ్చేవారు. ఈ విధంగా స్వామీజీ నా గురించి, నా అవసరాల గురించి కరుణ చూపేవారు. ఏ దిక్కూ లేని నాకు, అన్ని దిక్కులూ అన్నీ తానై ఆదుకున్నారు. స్వామీజీ నన్ను ఎప్పుడూ విడిచి పెట్టలేదు. స్వామీజీవారి సాన్నిధ్యాన్ని నేను ఎప్పుడూ, అన్ని కష్టకాలాలలోనూ గ్రహించాను, అనుభూతం చేసుకున్నాను.

ఒకరోజు ఒక వ్యక్తి వెనుక నుంచి అక్కా అని పిలిచాడు. నాకు అతనెవరో పరిచయంలేదు. నన్ను పేరుపెట్టి కూడా పిలిచాడు. "అన్నపూర్ణక్కా" "అన్నపూర్ణక్కా" రండి అని. అతను చాలా శ్రీమంతుడుగా కనిపిస్తున్నాడు మరియు పెద్ద బట్టలషాపు యజమాని. తన దుకాణానికి పిలిచాడు. రెండు చీరలను ఇచ్చి దయచేసి తీసుకోవాలన్నాడు. నేను అందుకు డబ్బులు ఇవ్వడానికి పోగా, ఎంతమాత్రమూ డబ్బులు తీసుకోవడానికి ఒప్పుకోలేదు. మా తల్లిదండ్రులు ఒకప్పుడు అతనికి చాలా సహాయం చేసారట. "అందుకు కృతజ్ఞతగా మీకు ఈ చీరలను మనస్ఫూర్తిగా ఇస్తున్నాను దయచేసి తీసుకోండి" అన్నాడు.

ఇంకోకసారి ఎవరో వచ్చి, "అమ్మా, మీకు నేను 600/- రూపాయలు ఇవ్వాల్సి ఉంది దయచేసి తీసుకోండి అనేవారు." నాకు మాత్రం అంత డబ్బు ఎవరికిచ్చానో ఎందుకిచ్చానో కూడా గుర్తు లేదు. "మీకు నేను డబ్బు అప్పు ఇచ్చినట్టుగా ఏమాత్రం గుర్తులేదు. కాని మీరు నిజంగా నా నుంచి డబ్బు తీసుకున్నట్టుగా గుర్తుంటే ఇవ్వండి. లేకపోతే నాకు ఇలా డబ్బులు తీసుకోవడం అస్సలు ఇష్టం ఉండదు" అన్నాను. అప్పుడు అతను మరో ఆలోచన లేకుండా డబ్బులు ఇచ్చి వెళ్ళిపోయారు. ఇలా అయాచితంగా సహాయం పొందిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇవన్నీ నాకు చాలా ఇబ్బందిగా ఉండేది. స్వామీజీని ఎప్పుడూ ప్రార్థించేదాన్ని, నాకు ఇలాంటి ఇతరుల దయమీద బ్రతికే సంకటప్రాయమైన స్థితిని కలిగించవద్దని. వారి జాలిని నేను భరించలేకపోయేదాన్ని. కాని "మీ తల్లితండ్రులు మాకు చేసిన సహాయంతో పోలిస్తే మేము చేస్తున్నది చాలా తక్కువ" అని చెప్పేవారు.

కొన్ని సార్లు నేను తీవ్ర రోగగ్రస్తురాలై లేవలేని స్థితిలో పడుకునే ఉండేదాన్ని. నాకు సహాయం చేయడానికి గానీ, వంట చేయడానికి గానీ ఎవరూ ఉండేవారు కారు. స్వామీజీవారే వచ్చి నాకు భోజనం తినిపించేవారు! ఆయన సూక్ష్మశరీరంలో ప్రత్యక్షమై తన స్వహస్తాలతో భోజనం తినిపించేవారు. నా కళ్ళారా చాలా స్పష్టంగా ఆయన చేతులనూ, కాళ్ళనూ, శరీరాన్ని చూశాను. తలచుకుంటేనే హృదయం ద్రవించిపోతుంది. ఎదలో పెల్లుబుకుతున్న వేయి భావోద్వేగాలు కన్నీళ్ళుగా బయటకొస్తున్నాయి. అనిర్వచనీయమైన అనుభూతి ఇది. ఏ జన్మలో చేసిన పుణ్యమో ఏమో ఇంతటి మహాత్ముడి కరుణకు నోచుకున్నాను.

తర్వాత ఎవరైనా దారిలో వెళ్తున్నవాళ్ళు మా ఇంటి ముందు ఆగి, లోపలికి వచ్చి చూసి "ఎందుకు అన్నపూర్ణా ప్రొద్దున్నుంచి ఏమీ తినలేదు. ఇదిగో తిను." అని ఆహారం ఇచ్చేవారు. "లేదండీ ఇప్పుడే నేను కడుపు నిండా భోజనం చేసాను. ఇక ఏమీ తినలేను" అన్నా కూడా నాతో వాదులాడి, "రోజంతా మంచం మీదే పడుకుని ఉన్నావు మాకు తెలుసు నువ్వేమీ వండుకోలేదని. మరి ఎలా తినుంటావు" అనేవారు. కాని నేను చెప్పేదాన్ని, ఇప్పుడే తిన్నాను నా కడుపు నిండిందని. కడుపు నిండిన త్రేన్పులు కూడా వచ్చేవి. స్వామీజీ తినిపించిన భోజనం యొక్క రుచి కూడా నాకు చాలా స్పష్టంగా తెలిసేది.

తరచూ నేను అనారోగ్యం పాలైనప్పుడల్లా, సహాయం కోసం పిలవడానికి ఎవరూ ఉండేవారు కాదు. ఎప్పుడూ మంచం మీద పడుకునే ఉండటం తప్ప నాకు అటూ, ఇటూ కదలడానికి కూడా చేతనయ్యేది కాదు. అటువంటప్పుడు డాక్టరుగారు అనుకోకుండా హఠాత్తుగా వచ్చేవారు. ఆయన ప్రొద్దున స్నానానికి వెళ్ళినప్పుడల్లా ఒక్క క్షణం నా గురించి ఆలోచించేవారట. ఆయన ఊరు నుండి క్లినిక్‌కి వెళ్ళేటప్పుడు దారిలో ఒకసారి వచ్చి ఆగి నా పరిస్థితి తెలుసుకొని వెళ్ళటం అలవాటు చేసుకున్నారు. ఒకొక్కసారి నేను మంచం మీద దయనీయ పరిస్థితిలో నిస్సహాయంగా పడి ఉండటం చూసి డాక్టరుగారు చాలా కోపంగా తిట్టేవారు. "ముందే ఎందుకు నాకు కబురు పంపలేదు. నీ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఇప్పుడు చికిత్స చేయడం చాలా కష్టం" అనేవారు. అందుకు నేను "నావల్ల లేచి రావడం కుదరలేదు. స్వామీజీ మిమ్మల్ని పంపించారు. స్వామీజీ పవరంటే అదే" అనేదాన్ని. రోజుకు మూడు నాలుగుసార్లు వచ్చి ఆయన నాకు చికిత్స చేసి వెళ్ళేవారు. క్లినిక్‌లో ఆయనకోసం రోగులు చాలా మంది వేచి ఉన్నా కూడా నేను మళ్ళీ శక్తి పుంజుకునేవరకూ ఆయన నా గురించి అమితమైన శ్రద్ధ చూపేవారు.

ఇలా స్వామీజీ నా జీవితాంతం నన్ను కనిపెట్టుకుంటూ, సంరక్షిస్తూ వున్నారు. ఆయన కోసం నేను చేసింది ఏమీ లేకపోయినా, నా జీవితాన్నంతా ఆయన మోసారు, బాధ్యత వహించారు. ఎన్ని జన్మలైనా ఆయనతోపాటే జన్మించాలి, ఆయన పాదాలవద్ద మోకరిల్లి సేవ చేసుకునే భాగ్యం కలిగించాలని స్వామీజీని ప్రార్థిస్తూ... - అన్నపూర్ణమ్మ *


*With best compliments from:*

(CPRI Approved)

**G.K. Engineers & Fabricators**

(ELECTRICAL PANELS)

***All Kinds of Electrical & Fabrication Works***

**Workshop:** # 5-53/916, Gnanakala Nilayam, Rami Reddy Nagar, 5th Phase, IDA, Jeedimetla, Hyderabad - 500 055.

**Cell: +91-98482 25251, Tele: +91-40-23090301**


E-mail: gkengineersfabricators@gmail.com

# కౌపీనధారి



సుమారు మూడు దశాబ్దాలకు పైగా స్వామీజీ వారు భారతదేశమంతటినీ కారులోనే పర్యటించారు. కొన్ని సందర్భాలలో భక్తులు విమాన టికెట్టును కొనిచ్చేవారు. స్వామీజీని విమానంలో ఆసీనులను చేసి, దిగే స్థలములో మరికొంతమంది భక్తులు స్వామీజీకి స్వాగతం పలకడానికి వేచి ఉండేవారు.

స్వామీజీవారు మామూలుగా బట్టలేవి వేసుకోకుండా కేవలం ఒక కౌపీనం మాత్రమే ధరించి ఉండటం అలవాటు. ఎక్కడికైనా వెళ్ళినా కూడా ఇలాగే వెళ్లేవారు.మాతాజీగారు కొనిచ్చిన మంచి నాణ్యమైన బూట్లను వేసుకుని వెళ్లేవారు. విమాన ప్రయాణం చేయవలసివచ్చినా ఆయన ఇలాంటి వస్త్రధారణతోనే వెళ్ళేవారు. తన పొడవైన జటలతో, ఒక చేతిలో తువ్వాలు, మరొక చేతిలో విమాన టికెట్టు పట్టుకుని, సాక్స్ వేసుకుని ఖరీదైన బూట్లను ధరించిన యోగిని విమానాశ్రయంలో వింతగా చూసేవారు. ఒకసారి కేవలం కౌపీనధారియై దాదాపు నగ్నంగా ఉన్న స్వామీజీని తమతో పాటు ప్రయాణించడానికి అక్కడి ప్రయాణీకులు అభ్యంతరం తెలిపారు. స్వామీజీ వారితో యోగులు ఇలాగే ఉంటారని వాదించారు. కాని పైలట్‌వచ్చి విమానయాన నియమాలు ఇలాంటి వస్త్రధారణకు ఒప్పుకోవని చెబితే, వారి నియమాలను గౌరవించి అప్పటినుండి స్వామీజీ ఒక శాలువాను కప్పుకోవడం మొదలుపెట్టారు.



స్వామీజీ శాలువా ధరించడం మొదలుపెట్టిన తర్వాత ఒకసారి భద్రతాసిబ్బందిలో ఒకతను లోపల ఏమైనా దాచారా అని అడిగారు. అందుకు స్వామీజీ శాలువా తీసి కిందపడేశారు. కౌపీనం తప్ప వేరే ఏమీ లేని నగ్న శరీరం చూసి భద్రతాసిబ్బంది ప్రణామం చేసి క్షమించమని అడిగారు. తర్వాత వారే స్వామీజీకి శాలువాను కప్పి పంపించారు.

కొన్ని సార్లు భద్రతా సిబ్బందివారు స్వామీజీ జటను కూడా పరిశీలించేవారు. అందులో ఏమైనా దాచారా అని చూసేవారు. ఒకసారి ఇంతపెద్ద జటను చూసి ఒక సెక్యూరిటీ గార్డు ఇందులో రైఫిల్‌ను ఏమైనా దాచిపెట్టారా అని ఆలోచించాడట! ❁

*With best compliments from:*

# Sri Gurukrupa
## Silks & Sarees

Spl in: WEDDING SAREES

# L-59, 9th Cross, 4th Main,
Lakshminarayanapuram,
Bangalore - 560 021

**Cell: 98456 65848**
**99453 81068**



*With best compliments from:*



# Sri Shiva Balayogi Graphics

DTP – Multicolour designing – Offset – Screen Printing


Opp. Sunanda Hotel, Chikkadpally, Hyderabad

**Cell: +91-99660 98931**



ప్రపంచ శాంతి కోసం ఒక సంవత్సరం తపస్సు పూర్తి చేసిన సందర్భంగా స్వామీజీ దర్శనమునకు హాజరైన అశేష భక్తజనం. ఆగస్టు 7, 1969

# శ్రీశ్రీశ్రీ శివబాలయోగి మహరాజ్ వారి కొన్ని పుస్తకముల పరిచయము



## Divine Play: the Silent Teaching of Shiva Bala Yogi

The first book on Shivabalayogi written for and published in the West.Clear, concise and compelling account of his tapas, travels, and blessings, with his answers to questions on a wide variety of subjects.Divine Play (2004, Handloom Publishing). 290 pages and over a hundred photos.



## Swamiji's Treasure: God Realization & Experiences of Shivabalayogi

The authoritative and comprehensive book on Shivabalayogi. Swamiji's Treasure is his devotees, particularly their experiences. This book collect all available biography and conversations with Shivabalayogi, as well as many, many miraculous experiences of his devotees. This is the treasure trove of everything Shivabalayogi. Swamiji's Treasure (2007, Handloom Publishing): 668 large format pages, over 360 photographs, hardcover.



## Tapas Shakti: Shri Shri Shri Shivabalayogi Maharaj

This is the book that Shivabalayogi asked to be written in 1991 to combine his then existing English biography, question & answer material collected mostly in the United States, and devotees' experiences, mostly in the U.S. Published in India, Shivabalayogi presented *Tapas Shakti* to the public on the occasion of his 59th birthday on January 24, 1992. Tapas Shakti (1992, Bangalore): 530 pages, hardcover.



## తపశ్శక్తి

స్వామీజీవారి సంక్షిప్త జీవిత చరిత్ర, భక్తుల అనుభవాలు, నిదర్శనములు మరియు స్వామీజీవారితో భక్తులు, శిష్యులు జరిపిన ప్రశ్నోత్తరాల సమాహారమే 'తపశ్శక్తి' పుస్తకము. ప్రథమ ముద్రణ: ప్రమాథి నామ సంవత్సర పుష్యమాసం.




## Sri Sri Sri Shivabalayogi Maharaj: Life & Spiritual Ministration

Collected and written by General (ret.) Hanut Singh, Spiritual Ministration was originally published by the Bangalore Trust on the occasion of Shivabalayogi's 46th birthday on January 24, 1981. It draws on previously published booklets on Shivabalayogi (see History of Books on Shivabalayogi) and General Hanut's own knowledge and conversations with Swamiji. Spiritual Ministration was republished in 1992 (Bangalore) and in 2008 (Dehradun).



## మహా తపస్వి

1981లో ఇంగ్లీష్‌లో ప్రచురితమైన Sri Sri Sri Shivabalayogi Maharaj : Life and Spiritual Ministration కి తెలుగు అనువాదం. 1983లో బెంగుళూరు ట్రస్టు వారిచే ప్రచురితమైనది. ఇందులో స్వామీజీవారి జీవిత చరిత్ర, ధ్యానము, భావసమాధి మరియు తపస్సు గురించి సుదీర్ఘమైన వివరణలు కలవు.



## The Living Yogi

The book about the mahasamadhi of His Holiness has been publised by Shri Swamiji's Trust in Bangalore on March 28th, 1995, the first anniversary of his leaving the body through yoga nidra. *The Living Yogi* was written at Shri Swamiji's direction and contains his 108 names, previously unpublished details of his biography, a detailed account of his mahasamadhi, and the many miracles of his presence ever since. The book's two hundrend pages are generously illustrated with photographs, including two miraculous photos showing astral bodies.

FOR PRIVATE CIRCULATION ONLY

